


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 339, పేజీలు - 08

శుక్రవారం, మే 29, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## ప్రతీ పౌరుడికి 'సమగ్ర సంక్షేమ కార్డు'

**- ఆధార్ తరహాలో ప్రత్యేక నంబర్**

**- పౌరులకు ఇస్తున్న పథకాల డేటా ఉండాలని వెల్లడి**

**- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. వృద్ధులు, వితంతువులు, మహిళలు, చిన్న పిల్లలు, యువకులకు ఇలా ఒక్కొక్కరికీ ఒక్కో రకమైన సంక్షేమ పథకాలు అందుతున్నాయి. అయితే రాష్ట్ర ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయానికి తెరతీసింది. రాష్ట్రంలోని ప్రతీ పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను అన్నింటినీ ఒకే కార్డులో నిక్షిప్తం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం సమగ్ర సంక్షేమ కార్డును రూపొందించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా సీఎం రేవంత్ రెడ్డి అన్ని శాఖల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్రంలో ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా ఏ పథకం కింద ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా స్పష్టంగా తెలియజేసేలా దాన్ని తయారు చేయాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. అందుకు అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. తాజాగా నిర్వహించిన ఈ సమీక్షలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టితో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరై ప్రత్యేకంగా చర్చించారు.ఈ సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా రాష్ట్రంలోని ప్రతీ పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో మరింత పారదర్శకత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విధానం అనుసరించడం వల్ల నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయని అదే సమయంలో అనర్హులను గుర్తించడం కూడా చాలా ఈజీ అవుతుందని అభిప్రాయపడ్డారు.ప్రతీ శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని సీఎం రేవంత్ సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు. ఈ సమగ్ర సంక్షేమ కార్డులో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాలు, ప్రభుత్వం తీసుకొస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్‌ను కూడా ఇచ్చేలా ఆలోచన చేయాలని సూచించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక,

2లో..

## కర్ణాటకలో ముగిసిన సిద్ధరామయ్య శకం

**- సీఎం పదవికి రాజీనామా సమర్పణ**



బెంగుళూరు (ప్రశ్న న్యూస్) కర్ణాటక రాజకీయాల్లో కీలక ఘట్టం చోటుచేసుకుంది. గత మూడు దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాల్లో అగ్రనేతగా వెలుగొందుతున్న సిద్ధరామయ్య తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం గవర్నర్ అధికారిక నివాసం లోక్ భవన్ కు చేరుకున్న ఆయన, తన రాజీనామా లేఖను సమర్పించారు. గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ప్రస్తుతం నగరంలో అందుబాటులో లేనందున, సిద్ధరామయ్య తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి కు అందజేశారు. ఈ సందర్భంగా తన క్యాబినెట్ సహచరులు,మద్దతుదారులతో కలిసి ఆయన రాజ్‌భవన్‌కు వచ్చారు.

**- హైకమాండ్ ఆదేశమే శిరోధార్యం**

రాజీనామా అనంతరం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాల మేరకు నేను ఈ నిర్ణయం తీసుకున్నాను. సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే మరియు రాహుల్ గాంధీ నాకు ఇచ్చిన అవకాశానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా చిత్తశుద్ధితో

2లో..

## ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

**- మహానాడులో టీడీపీ ఏకగ్రీవంగా తీర్మానం - తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అన్న చంద్రబాబు**

**- ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలనేది ప్రజలందరి డిమాండ్ అని వ్యాఖ్య**



అమరావతి (ప్రశ్న న్యూస్) తెలుగుజాతికి వెలుగై నిలిచిన స్వర్గీయ నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలనేది ప్రజలందరి డిమాండ్ అని టీడీపీ అధినే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దేశరాజకీయాల్లో పెనుమార్పులకు నాంది పలికిన మహోన్నత నాయకుడికి భారతరత్న ఇవ్వాలని ఆయన కోరారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని గురువారం మహానాడు రెండో రోజున ఎన్టీఆర్ కు నివాళి అర్పించే తీర్మానంపై సీఎం చంద్రబాబు ప్రసంగించారు. తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు తెలుగు ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని సీఎం అన్నారు. సామాన్య ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. ప్రజల మనస్సుల్లో ఎన్టీఆర్ చిరస్మరణీయ స్థానం సంపాదించారన్నారు. తెలుగు ప్రజల ఐక్యత కోసం పనిచేసిన మహోన్నత నేత ఎన్టీఆర్ అని భారత రాజకీయ చరిత్రలో ఆయన సేవలు విశిష్టం, అపూర్వం అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎన్టీఆర్‌కు భారత రత్న ప్రకటించాలని మహానాడు ఏకగ్రీవంగా తీర్మానించింది.

**-ఎన్టీఆర్ ఖ్యాతి మరెవరికీ సాధ్యం కాదు**

2లో..

## హైదరాబాద్‌లో ఎకరాకు రూ. 237 కోట్లు

**- రికార్డు స్థాయిలో చుక్కలనంటిన భూముల ధరలు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో భూముల ధరలు చుక్కలనంటుతున్నాయి. తాజాగా జరిగిన భూముల వేలం గత రికార్డులను బద్దలు కొట్టింది. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) గురువారం నిర్వహించిన ఈ-వేలంలో రాయదుర్గంలోని పాన్‌మక్తాలో భూమి రికార్డు ధర పలికింది. గతంలో జరిగిన భూముల వేలం రికార్డులను బద్దలు కొడుతూ ఎకరం ధర రూ. 237 కోట్లు పలికింది. ఇదే ప్రాంతంలో గతేడాది అక్టోబర్‌లో టీజీఐఐసీ నిర్వహించిన వేలంలో ఎకరం ధర రూ.177 కోట్లు పలికింది. కొన్ని నెలల వ్యవధిలోనే ఈ ప్రాంతంలో ఎకరం భూమి ధర దాదాపు రూ. 60 కోట్లు పెరగడం గమనార్హం. ఇందుకు సంబంధించిన

2లో..

## గృహనిర్మాణ యజ్ఞం చేసిన నిర్మాతలం మేము

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) 'ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ మాది! సవాళ్లు చేయడం, పారిపోవడం నీతిలేని కాంగ్రెస్ నేతలకు అలవాటు!' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. స్వరాష్ట్రాన్ని సాధించాం స్వగృహ స్వప్నాలను సాకారం చేశాం!అని చెప్పుకొచ్చారు. డబ్బా ఇండ్లు కాదు, డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించాం! అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా వెల్లడించారు. '20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతాం అని చాలెంజ్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా? శపథం చేయడం కాదు, చేతనైతే చేసి చూపించాలి! 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే, గుమ్మం తొక్కి ఓట్లు అడుగుతాం అన్న సవాల్‌కు కట్టుబడి వుండాలి పౌరుషం వుంటే!'అంటూ రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు.

**- గృహ నిర్మాణ యజ్ఞం చేసిన నిర్మాతలం మేము**

'హైదరాబాద్ మహానగరంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించిన ఘనత మాది!. రూ.70 వేలతో అగ్గిపెట్టె ఇండ్లు కట్టలేదు మేం. మేం కట్టిన ఒక్కో గృహం 7 ఇందిరమ్మ ఇండ్లతో సమానం..!'అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.'చరిత్రలో ఎవరూ ఎప్పుడూ చేయని సాహసంతో 60 ఏండ్లు ఏలిన పార్టీలకు ఎన్నడూ రాని ఆలోచనతో దేశానికి నమూనాగా అందమైన పొదరిల్లను నిర్మించి చూపించాం!. మీకు చిత్తశుద్ధి వుంటే సత్తా వుంటే అంతకు మించి హైదరాబాద్లో డబుల్ బెడ్ రూం గృహాలను కట్టండి!'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు.'గృహ నిర్మాణ

2లో..

## కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీఆరే

**- అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేసిన సీఎం రేవంత్ రెడ్డి**

**- ఎన్టీఆర్ భిక్ష లేకుండా రాజకీయాల్లోకి వచ్చారా అని కేసీఆర్‌కు ప్రశ్న**

**- ఎన్టీఆర్ పేరు పెట్టుకున్న నకిలీలు రాజకీయాల్లో ఉన్నారని ఫైర్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా.. హైదరాబాద్ అమీర్‌పేటలోని మైత్రివనం సర్కిల్‌లో ఎన్టీఆర్ 23 అడుగుల విగ్రహాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి ఎన్టీఆర్ చేసిన సేవలను, ఆయన ఆశయాలను గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంతోమందిని రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. అదే సమయంలో దేశం గర్వించదగ్గ గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని తేల్చి చెప్పారు. ఎన్టీఆర్, ఇందిరాగాంధీల స్ఫూర్తితో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పాలన చేస్తోందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులైన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ తరఫున ముఖ్యమంత్రిగా ఉన్న తాను ఆవిష్కరించడంపై వస్తున్న

2లో..

## అంతర్రాష్ట్ర జలవివాదాలు

**- ప్రధాని మోదీ సూచన**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రాష్ట్రాల మధ్య తలెత్తే నీటి వివాదాలను పరస్పర సహకారం, సకాలంలో అనుమతులు ఇవ్వడం, సరికొత్త సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ ద్వారా పరిష్కరించుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ విషయంలో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మధ్య సాగుతున్న 'కెన్-బెత్వా' నదుల అనుసంధాన ప్రాజెక్టు దేశానికే ఒక గొప్ప ఆదర్శంగా నిలవాలని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం సాయంత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులతో నిర్వహించిన 51వ 'ప్రగతి' వెబ్‌క్యాస్ట్ సమావేశంలో ప్రధాని ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షలో రైల్వేలు, విద్యుత్, రహదారి రంగాలకు చెందిన సుమారు రూ.30,000 కోట్ల విలువైన ఏడు భారీ ప్రాజెక్టుల పురోగతిని ప్రధాని పరిశీలించారు. ప్రభుత్వ పనుల అమలులో

2లో..

## మహానాడు సంచలన రికార్డు సృష్టించింది

**- మహానాడుకు 11 లక్షల మంది హాజరయ్యారన్న నారా లోకేశ్**

**- వీరంతా ఈ-అటెండెన్స్ లో నమోదు చేయించుకున్నారని వెల్లడి**

**- అన్ని నియోజకవర్గాల్లో మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామన్న లోకేశ్**



అమరావతి (ప్రశ్న న్యూస్) తొలిసారి హైబ్రిడ్ మోడల్ లో నిర్వహిస్తున్న మహానాడు సంచలన రికార్డు సృష్టించిందని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మహానాడు కార్యక్రమాలకు 11 లక్షల మంది క్యాడర్ హాజరయ్యారని ఆయన వెల్లడించారు. ఈ-అటెండెన్స్ లో వీరంతా నమోదు చేయించుకున్నారని తెలిపారు. మహానాడులో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఆయన ఈ వివరాలను వెల్లడించారు. పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలను తీసుకురావాల్సిన అవసరం ఉందని లోకేశ్ అన్నారు. ఎన్టీఆర్ కాలం నుంచే ఎప్పటికప్పుడు మార్పులు

2లో..

## వరి సాగుకు కేంద్రం కళ్లెం

**-5 ఏళ్లలో 25 లక్షల ఎకరాలు తగ్గించాలని టార్గెట్**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) గత కొన్నేళ్లుగా తెలంగాణలో విపరీతంగా వరిధాన్యం పండుతోంది. రైతులు పంట విస్తీర్ణాన్ని పెంచడమే కాకుండా మెరుగైన విత్తనాలు, పురుగు మందులు, సరైన సాగు పద్ధతులతో వరి ఉత్పత్తిలోనూ భారీగా దిగుబడులు సాధిస్తున్నారు. ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఏటా వరి ఉత్పత్తి భారీగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే దేశంలోనే వరి ధాన్యాన్ని ఉత్పత్తి చేసే రాష్ట్రాల జాబితాలో తెలంగాణ

2లో..

## కాజీపేటలో ఐదేళ్లలో 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ

**- త్వరలోనే ప్రారంభించనున్నట్లు అశ్వినీ వైష్ణవ్ ప్రకటన**

**- 5 ఏళ్లలో 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయనున్నట్లు వెల్లడి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రజలు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న కాజీపేట రైళ్ల తయారీ యూనిట్ పూర్తి కావచ్చిందని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు.

2లో..

# ప్రతీ పౌరుడికి 'సమగ్ర సంక్షేమ కార్డు'

విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ సమగ్ర సంక్షేమ కార్డుకు అనుసంధానం చేయాలని రేవంత్ రెడ్డి అధికారులకు చెప్పారు. లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు.ఈ సమగ్ర సంక్షేమ కార్డుకు ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే వెంటనే ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని దాని ఆధారంగా వెంటనే చర్యలు మొదలయ్యేలా ఉండాలని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో లింక్ చేయాలని వెల్లడించారు. కేరళ నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా అధికారులకు సీఎం సూచించారు.నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్ట్‌లు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంచితే అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు కచ్చితంగా చేరేలా ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# కర్ణాటకలో ముగిసిన సిద్ధరామయ్య శకం

నిర్వహిస్తాను అని ఆయన స్పష్టం చేశారు. మూడేళ్ల పాటు తన ప్రభుత్వానికి సహకరించిన మంత్రులు, ఎమ్మెల్యేలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సిద్ధరామయ్య తన ప్రసంగంలో పవర్ షేరింగ్ ఒప్పందాన్ని గౌరవిస్తున్నట్లు పరోక్షంగా సూచించారు. హైకమాండ్ ఏ బాధ్యత అప్పగించినా నిర్వర్తిస్తానన్నారు.

## - డీకే శివకుమార్ పట్టాభిషేకం ఖాయం

సిద్ధరామయ్య రాజీనామాతో ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ తదుపరి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. అంతకుముందు ఉదయం జరిగిన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ లో సిద్ధరామయ్య స్వయంగా తన సహచరులకు ఈ విషయం వెల్లడించారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ సిద్ధరామయ్య పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకోవడం సభలో చర్చనీయాంశమైంది. మే 29 సాయంత్రం జరగబోయే కాంగ్రెస్ శాసనసభా పక్షం సమావేశంలో శివకుమార్‌ను అధికారికంగా కొత్త నేతగా ఎన్నుకోనున్నారు.

## - రాజకీయ వ్యూహం - రాజ్యసభ ఆఫర్

సిద్ధరామయ్యను జాతీయ రాజకీయాల్లోకి పంపాలని కాంగ్రెస్ హైకమాండ్ యోచిస్తోంది. ఆయనకు రాజ్యసభ సీటుతో పాటు ఏఐసీసీలో కీలక పదవిని ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే సిద్ధరామయ్య ఈ ప్రతిపాదనపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుతానికి రాష్ట్ర రాజకీయాల్లోనే కొనసాగేందుకు మొగ్గు చూపుతున్నారని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన సిద్ధరామయ్య, తనదైన సోషల్ ఇంజనీరింగ్ ద్వారా కర్ణాటకలో చెరగని ముద్ర వేశారు. సిద్ధరామయ్య నిష్క్రమణతో కర్ణాటక కాంగ్రెస్‌లో ఒక అధ్యాయం ముగిసింది. డీకే శివకుమార్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం పాలనలో ఎలాంటి మార్పులు తీసుకువస్తుందో చూడాలి. రెండు రోజుల్లో శివకుమార్ సీఎంగా ప్రమాణం చేయనున్నారు.

# ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

'తెలుగు జాతి ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయే వ్యక్తి ఎన్టీఆర్. ఎన్టీఆర్ జయంతి తెలుగువారందరికీ పండుగ రోజు. సాధారణ ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి, సినీ జీవితంతో పాటు రాజకీయాల్లోకి వచ్చి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఎదిగారు. ఎన్టీఆర్ మళ్లీ పుడితే తప్ప ఆయన క్రమశిక్షణ, ఆయన ఖ్యాతి మరెవరికీ సాధ్యం కాదు. ఆయన ఎక్కడ ఉన్నా తెలుగువారి ఆత్మగౌరవం కోసమే జీవించారు. రైతుబిడ్డ నుంచి సినిమాల్లో శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రల వరకూ, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఆయన చరిత్ర సృష్టించారు. ఎన్టీఆర్ పేరు తలుచుకుంటేనే పట్టుదల, ఆత్మవిశ్వాసం వస్తుంది. ఆయన పేరు తలచుకుని సంకల్పం చేస్తే చాలు దేనికీ తిరుగు ఉండదు.

దేశ రాజకీయాల్లో ఆయన లాంటి నాయకుడు మరొకరు లేరు. ఆయన మొదట సబ్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగంలో చేరి ఆ తర్వాత ఆయన సినిమాల్లోకి వచ్చారు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన స్థాపించిన ప్రాంతీయ పార్టీ అయిన తెలుగుదేశం దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించింది. కేంద్రంలో ప్రభుత్వాల ఏర్పాటులో ముఖ్య పాత్ర పోషిచింది' అని సీఎం చంద్రబాబు అన్నారు.

## - ప్రజల మనస్సుల్లో ఎన్టీఆర్‌ది చిరస్మరణీయ స్థానం

'ఎన్టీఆర్ పాలన రైతులకు అండ, మహిళలకు భరోసా, కార్మికులకు అభయం, యువతకు దిక్సూచి అయ్యింది. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదాన్ని శాశ్వత విధానంగా ఎన్టీఆర్ మార్చారు. తెలుగుదేశం జెండా ఆడబిడ్డలకు అండ, రైతన్నలకు భరోసా, యువతకు విశ్వాసం. 1983లో రాజకీయాల్లో యువతకు ఎన్టీఆర్ అవకాశాలు కల్పించారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించారు. భవిష్యత్‌లో పార్టీకి సమర్థ నాయకత్వం ఉండేలా భవిష్యత్ కార్యాచరణ చేపడుతున్నాం. పార్టీకి కార్యనిర్వాహక అధ్యక్షులుగా లోకేష్ మహానాడు తొలిరోజున ప్రతిపాదించిన 33 శాతం రిజర్వేషన్లను మనమే ప్రారంభిద్దాం. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రాన్ని మరోమారు కోరదాం'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.

# హైదరాబాద్‌లో ఎకరాకు రూ. 237 కోట్లు

వివరాలు ఇలా ఉన్నాయి రాయదుర్గం కారిడార్‌లోని 6.29 ఎకరాల విస్తీర్ణం గల భూమిని టీజీఐఐసీ వేలంలో ఉంచింది. ఈ వేలంలో ఎకరాకు కనీస రిజర్వ్ ధరను రూ. 139 కోట్లుగా నిర్ణయించారు. అయితే ఈ-వేలంలో బిడ్డింగ్ ధర ఎకరాకు సుమారు రూ. 237 కోట్లకు చేరుకుంది. అంటే, కనీస రిజర్వ్ ధరతో పోలిస్తే వేలంలో పలికిన ధర 70.5 శాతం అధికం కావడం విశేషం. దీంతో 6.29 ఎకరాల భూమి వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు రూ. 1,490 కోట్లు లభించాయి. తద్వారా ఇది గత రికార్డులను బద్దలు కొట్టింది. ఇక, ఈ భూమి వేలం అనంతరం టీజీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కే శశాంక మాట్లాడుతూ రాయదుర్గంలో భూమి వేలానికి అద్భుతమైన స్పందన లభించిందని తెలిపారు.

హైదరాబాద్, తెలంగాణపై పెట్టుబడిదారులు, డెవలపర్‌లకు ఉన్న అసాధారణమైన విశ్వాసానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. అదే సమయంలో మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి వంటి కీలక ఐటీ జోన్లకు రాయదుర్గం సెంటర్ పాయింట్‌గా ఉంది. ఔటర్ రింగ్ రోడ్డు, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, హైదరాబాద్ మెట్రో రాయదుర్గంకు మెరుగైన కనెక్టివిటీని అందిస్తున్నాయి. వీటితోపాటు లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ అపార్ట్‌మెంట్లు, ఇంటర్నేషనల్ స్కూళ్లు, షాపింగ్ మాల్స్, స్టార్ హోటళ్లు అక్కడే ఏర్పాటు చేస్తుండటంతో రాయదుర్గం ప్రాంతంలో ఇప్పుడు భూములు భారీ ధర పలుకుతున్నాయి.

# గృహనిర్మాణ యజ్ఞం చేసిన నిర్మాతలం మేము

యజ్ఞం చేసిన నిర్మాతలం మేము, గృహ మేధ యాగం చేస్తున్న విధ్వంసకులు మీరు! ఇటుకలు పేర్చి ఇండ్లు కట్టింది మేం పేదల ఇండ్లమీద బుల్డోజర్లు ఎక్కించి కూలగొడుతున్న క్రూరులు మీరు!.వీకెండ్ లో మంది కొంపలు కూల్చి పొందుతున్న మీరు ఇండ్లు కట్టడం గురించి మాట్లాడటానికి సిగ్గుండాలి కదా!.రెండున్నర ఏండ్లలో నగరంలో కట్టిన ఇండ్లు ఎన్ని, పడగొట్టిన ఇండ్లు ఎన్ని, శ్వేత పత్రం ప్రకటించే దైర్యం ఉందా?'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు.

## - తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం తెలుసు

'దీపావళి బాంబులు పేలుస్తామని, తుస్సు మనిపించిన తుపాకీ మినిస్టర్, మిస్టర్ బాంబులేటి?. మాకు తెలంగాణ ఆత్మ గౌరవాన్ని నిలబెట్టడం తెలుసు. ఆత్మాభిమానంతో బతకడం తెలుసు!. మీలాగా కోవర్టులతో కాళ్లు పట్టుకొని, ఢిల్లీకి లొంగిపోయి, కేసుల నుంచి తప్పించుకునే ఉపాయం మాకు తెల్వదు!'అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'అడ్డదారుల్లో కొడుకు కంపెనీకి వేల కోట్ల కాంట్రాక్టులు ఇప్పించుకునే అవినీతి కిటుకులు మాకు తెల్వదు!. అక్రమ క్రషర్లు నడుపుతూ అడ్డగోలుగా ప్రభుత్వ సొమ్మును కొల్లగొట్టే చిట్కాలు మాకు తెల్వదు!'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు.

## - బలహీన వర్గాల మంత్రులపై పేపర్లు విసిరికొట్టడం మాకు తెల్వదు

'రెవిన్యూ శాఖను అడ్డుపెట్టుకొని, భూభారతిలో బ్లాక్ లిస్టులు, బ్లాక్ మెయిల్ దందాలు చేసి దండుకునే లాండ్ గేమ్స్ తెల్వదు!. గూండాలను ఉసిగొల్పి, సామాన్యులపై దౌర్జన్యాలు చేసి భూములను బుక్కు పెట్టడం తెల్వదు!'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు.'బడుగు బలహీన వర్గాల నేతల మీద అహంకారంతో పేపర్లు విసిరికొట్టడం తెల్వదు మాకు!. మీరెన్ని పనికిమాలిన ప్రగల్భాలు పలికినా డైవర్షన్ డ్రామాలు ఆడినా420 హామీల ఎగ్గొట్టిన మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టం!. ఆరు గ్యారెంటీల, 13 డిక్లరేషన్ల ఎగవేత ద్రోహాన్ని ప్రశ్నించకుండా విడిచిపెట్టం.!. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తామని ప్రతినబూనండి మీకు దమ్ముంటే.!'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు.

# అంతర్రాష్ట్ర జలవివాదాలు

అనవసర జాప్యం చేయడం వల్ల ప్రాజెక్టు వ్యయం విపరీతంగా పెరిగిపోతుందని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. పనులు ఆలస్యమైతే ప్రజలకు అందాల్సిన సౌకర్యాలు సకాలంలో అందకుండా పోతాయని అధికారులను హెచ్చరించారు. నదుల అనుసంధానం, నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, ఆధునిక నీటిపారుదల పద్ధతుల ద్వారా దేశంలో దీర్ఘకాలిక నీటి భద్రతను సాధించేందుకు అన్ని రాష్ట్రాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు.

## - రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులపై ఫోకస్

విద్యుత్ రంగాన్ని సమీక్షించిన ప్రధాని.. పట్టణ ప్రాంతాల్లోని ఇళ్లు, నివాస సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రూఫ్‌టాప్ సోలార్ (భవనాలపై సౌర విద్యుత్) అమరికను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. కరెంట్ బిల్లుల ఖర్చును తగ్గించడానికి, ఇంధన భద్రతను పెంచడానికి క్లీన్ ఎనర్జీని ఒక 'మిషన్ మోడ్' ఉద్యమంలా చేపట్టాలన్నారు. ఇందులో భాగంగానే సాగునీటి కాలువల వెంబడి, కాలువలపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసే సరికొత్త విధానాన్ని అన్వేషించాలని రాష్ట్రాలకు సూచించారు. దీనివల్ల అదనపు భూమి అవసరం లేకుండానే విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని, ఎండ తీవ్రతకు నీరు ఆవిరైపోకుండా అడ్డుకోవచ్చని వివరించారు.

## - దేశ ప్రవేశ ద్వారంగా వధావన్ పోర్ట్

మహారాష్ట్రలో నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక వధావన్ పోర్ట్ ప్రాజెక్టును కేవలం ఒక ఓడరేవులా కాకుండా, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా మల్టీ-మోడల్ లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రధాని ఆదేశించారు. ఈ ప్రాజెక్టు తీరప్రాంత షిప్పింగ్, అంతర్గత జలమార్గాలు, ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు, హైస్పీడ్ రైళ్లు, జాతీయ రహదారులు, విమానాశ్రయాలతో సజావుగా అనుసంధానమవ్వాలన్నారు. ఇది భారతదేశ రవాణా రంగానికి ఒక అంతర్జాతీయ ప్రవేశ ద్వారంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## - స్వచ్ఛ భారత్ 2.0 విజయవంతం కావాలి

కేవలం మౌలిక వసతుల కల్పనతోనే సరిపెట్టకుండా, నిరంతర పర్యవేక్షణ, ప్రజల భాగస్వామ్యంతో 'స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0' లో స్పష్టమైన ఫలితాలు సాధించాలని మోదీ నొక్కిచెప్పారు. పట్టణాల్లో తడి, పొడి వ్యర్థాల శుద్ధి కర్మాగారాలు, గోబర్ధన్ ప్లాంట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించారు. కేంద్ర విభాగాలు, రాష్ట్రాలు మరింత చురుకైన కాలపరిమితి విధానాన్ని అనుసరిస్తూ అడ్డంకులను తొలగించాలని కోరారు. సమావేశం ప్రారంభంలో క్యాబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్ మాట్లాడుతూ.. ప్రధాని ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో సామాజిక రంగ పథకాలపై ప్రతి నెలా సమీక్ష జరిపే నూతన పర్యవేక్షక వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో జవాబుదారీతనాన్ని పెంచే ఈ కొత్త విధానంలో భాగంగానే, స్వచ్ఛ భారత్ మిషన్ అమలును తొలిసారిగా రాష్ట్రాల వారీగా సమీక్షించబోతున్నట్లు ఆయన వెల్లడించారు.

# కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీఆరే

విమర్శలకు ధీటుగా సమాధానం చెప్పారు. తమకు ఇందిరాగాంధీ ఎంత ముఖ్యమో ఎన్టీఆర్ కూడా అంతే ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. భారతదేశ చరిత్రను చదవాలన్నా, స్ఫూర్తి పొందాలన్నా ముగ్గురు నేతలను స్మరించుకోవాలని పేర్కొన్న రేవంత్ రెడ్డి ఆ ముగ్గురూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని స్పష్టం చేశారు. వారి కీర్తి ప్రతిష్ఠలను గుర్తుచేసుకోవాలని హితవు పలికారు.పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని అదే సమయంలో భారతదేశాన్ని ప్రపంచం ముందు తలెత్తుకునేలా చేసిన గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని ఆమె భూసంస్కరణలు తీసుకువచ్చి పేదలకు ఎంతో లబ్ధి చేకూర్చారను గుర్తు చేశారు. ఇక తెలుగుజాతిలో స్ఫూర్తి నింపిన ఎన్టీఆర్ బడుగు, బలహీనవర్గాల కోసం ఎన్నో కార్యక్రమాలు తీసుకువచ్చారని తెలిపారు. కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా దేశం గర్వించదగిన నేత ఎన్టీఆర్ అని పేర్కొన్న రేవంత్ రెడ్డి అందుకే ఆయన విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున పెట్టినట్లు స్పష్టం చేశారు. ఇది తనకు జీవితకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకమని తెలిపారు. తనపై ఈ విషయంలో ఎవరు ఎలాంటి విమర్శలు చేసినా తాను వెనక్కి తగ్గనని, భయపడనని తేల్చి చెప్పారు. గతంలో తెలంగాణ నుంచి పీవీ నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి, వెంకటస్వామిలాంటి నేతలను ఇందిరాగాంధీ అందించారని పేర్కొన్నారు.తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, కడియం శ్రీహరి, దేవేందర్‌గౌడ్, మోత్కుపల్లి నర్సింహులు వంటి నాయకులను తెలంగాణకు అందించిన వ్యక్తి ఎన్టీఆర్ అని రేవంత్ రెడ్డి తెలిపారు. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎవరని ఎన్టీఆర్ నీడలో బతికిన కేసీఆర్ ఇప్పుడు ఆయనను తక్కువ చేసి మాట్లాడటం సరైందేనా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ లేకుండానే మీరు నాయకులు అయ్యారా అని ప్రశ్నించారు. గ్రామాల్లో పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి ఎన్టీఆర్ పేదలకు విముక్తి కల్పించారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ పేరు పెట్టుకున్న కొందరు నకిలీలు కూడా రాజకీయాల్లో ఉన్నారని రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# వరి సాగుకు కేంద్రం కళ్లెం

కూడా చేరిపోయింది. అయితే దేశవ్యాప్తంగా బియ్యం, వడ్ల నిల్వలు భారీగా పేరుకుపోతున్నాయి. గోదాముల్లో భారీగా నిల్వ ఉండటంతో.. ఇటీవలె కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రబీ పంట కొనుగోళ్లు ప్రారంభం కాకముందే.. 3 నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని దేశవ్యాప్తంగా ఒకేసారి ఏప్రిల్ నెలలో జారీ చేసింది. దీంతో గోదాముల్లో కాస్త ఖాళీ ఏర్పడింది. అయితే పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రతీసారి ఇలాగే చేయలేమని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. దేశవ్యాప్తంగా వరి పంట సాగును తగ్గించాలనే టార్గెట్ పెట్టుకుంది.

ఈ క్రమంలోనే తెలంగాణలో రికార్డు స్థాయిలో పెరుగుతున్న వరి సాగుపై కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి.. పంటల మార్పిడిని ప్రోత్సహించడమే లక్ష్యంగా సరికొత్త ప్రణాళికను రెడీ చేసింది. దేశవ్యాప్తంగా రాబోయే 5 ఏళ్లలో ఏకంగా 2.5 కోట్ల ఎకరాల (250 లక్షల ఎకరాలు) మేర వరి సాగును తగ్గించాలని ఒక భారీ లక్ష్యాన్ని పెట్టుకుంది. ఇందులో తెలంగాణ వాటా 10 శాతం. అంటే తెలంగాణలో రానున్న ఐదేళ్లలో ఏకంగా 25 లక్షల ఎకరాల్లో వరి సాగును తగ్గించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతీ సంవత్సరం 5 లక్షల ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. తెలంగాణలో వరి సాగు రికార్డులు సృష్టిస్తుండగా.. గడిచిన 3 ఏళ్లలోనే సాగు విస్తీర్ణం ఏకంగా 16 లక్షల ఎకరాలు పెరిగి మొత్తంగా 133 లక్షల ఎకరాలకు చేరింది. దీంతో ఏటా సుమారు 3 కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతోంది. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం.. ప్రతీ గ్రామంలోనూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కావడంతో వరి పంటను పండించేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతోపాటు సన్న వడ్లు పండిస్తే క్వింటాలుకు రూ.500 అదనపు బోనస్ ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించడంతో తెలంగాణ రైతులు వరి పంట వైపే మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వ గోదాముల్లో నిల్వలు పేరుకుపోయి స్థలం లేక తీవ్ర సమస్య తలెత్తింది. ఈ సమయంలోనే యాసంగి ధాన్యానికి డిమాండ్ కరవైంది. ఇక రాష్ట్రంలో, దేశంలో వరి ధాన్యం విపరీతంగా పండటంతో డిమాండ్ తగ్గగా మరోవైపు పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో మన అవసరాలకు తగ్గట్టుగా తెలంగాణలో ఇవన్నీ ఉత్పత్తి కాకపోవడంతో వాటి కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. అందుకే తెలంగాణలో వరి పంటను తగ్గించి.. ఆ స్థానంలో పప్పుధాన్యాలు, ఇతర వాణిజ్య పంటలు, పామాయిల్ వైపు రైతులను మళ్లించాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది.

# మహానాడు సంచలన రికార్డు సృష్టించింది



చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. సిద్ధాంత పరంగానే తాము సంస్కరణలు తీసుకొస్తున్నామని ఎన్నికల కోసం కాదని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామని వెల్లడించారు. జెన్ జీ యువత ఏం ఆశిస్తుందో ఆలోచించి దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాల్సి ఉందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ సిద్ధంగా ఉందని లోకేశ్ తెలిపారు. జగన్ మాదిరి తాము ఏకపక్షంగా ఏకగ్రీవాలు చేసుకోబోమని చెప్పారు. టీడీపీ ప్రజాస్వామ్యబద్ధంగానే ముందుకు సాగుతుందని అన్నారు. జగన్ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ల పేపర్లను లాక్కుని ఎలాంటి అరాచకాలకు పాల్పడ్డారో అందరం చూశామని చెప్పారు. డీఎస్సీపై జగన్ వేయించిన కేసులన్నింటినీ కోర్టు కొట్టివేసిందని తెలిపారు. జగన్ తన కుటుంబ చరిత్రను తానే తవ్వి తీయించారని లోకేశ్ ఎద్దేవా చేశారు. రాజారెడ్డి అరాచకాలు, బెరైటీస్ గనుల కోసం చేసిన హత్యలు అన్నింటినీ ప్రజలకు తెలియజేసిన ఘనత జగన్ దేనని అన్నారు.

# కాజీపేటలో ఐదేళ్లలో 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ

కేంద్ర ప్రభుత్వం ఈ కాజీపేట రైల్వే తయారీ యూనిట్ ను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోందని వెల్లడించారు. ఈ కాజీపేట రైల్వే తయారీ యూనిట్ పనులు చివరి దశకు చేరుకున్నట్లు అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. ఢిల్లీలో కేంద్ర రైల్వే సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టు సీనియర్ రైల్వే అధికారులతో కలిసి కాజీపేట రైలు తయారీ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చేయాల్సిన ప్రణాళికలపై రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమీక్ష నిర్వహించారు. కాజీపేట రైల్వే యూనిట్‌లో త్వరలోనే సరికొత్త ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయనున్నట్లు కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ఈ రైళ్ల తయారీ యూనిట్ ద్వారా రానున్న 5 ఏళ్ల కాలంలో దేశవ్యాప్తంగా వివిధ రూట్లలో నడిపేందుకు 200 అత్యాధునిక ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. ఈ రైళ్లను దేశవ్యాప్తంగా తక్కువ దూరాల్లో ఉన్న రైల్వే స్టేషన్ల మధ్య ప్రయాణికుల రవాణాకు ఉపయోగించనున్నట్లు తెలిపారు.ఇక ఈ ఇంటర్ సిటీ రైళ్లు అత్యాధునిక సదుపాయాలతో ఉంటాయని అశ్వినీ వైష్ణవ్ వివరించారు. కొత్తగా అందుబాటులోకి రానున్న ఈ ఇంటర్ సిటీ రైళ్లు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్‌తోపాటు మెరుగైన వెంటిలేషన్‌తో తయారు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటర్‌సిటీ రైలులో 20 కోచ్‌లు ఉంటాయని.. వాటిలో సురక్షితమైన కోచ్ డిజైన్, అత్యాధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. ఈ ఇంటర్‌సిటీ రైళ్లను గంటకు 130 కిలోమీటర్ల వేగంతో పరుగులు పెట్టేలా తయారు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సరికొత్త అత్యాధునిక ఇంటర్‌సిటీ రైళ్లలో రీజనరేటివ్ బ్రేకింగ్ సిస్టమ్ ఉంటుందని మంత్రి వివరించారు. అంటే రైలు ప్రయాణిస్తుండగా బ్రేకులు వేస్తే అది విద్యుత్ జనరేటర్‌గా మారి మళ్లీ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందని ఆ పునరుత్పత్తి అయిన విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌లోకి పంపించే అత్యాధునిక టెక్నాలజీతో తయారు చేస్తున్నట్లు అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.తం అధికం కావడం విశేషం. దీంతో 6.29 ఎకరాల భూమి వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు రూ. 1,490 కోట్లు లభించాయి. తద్వారా ఇది గత రికార్డులను బద్దలు కొట్టింది. ఇక, ఈ భూమి వేలం అనంతరం టీజీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కే శశాంక మాట్లాడుతూ రాయదుర్గంలో భూమి వేలానికి అద్భుతమైన స్పందన లభించిందని తెలిపారు. హైదరాబాద్, తెలంగాణపై పెట్టుబడిదారులు, డెవలపర్‌లకు ఉన్న అసాధారణమైన విశ్వాసానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. అదే సమయంలో మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి వంటి కీలక ఐటీ జోన్లకు రాయదుర్గం సెంటర్ పాయింట్‌గా ఉంది. ఔటర్ రింగ్ రోడ్డు, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, హైదరాబాద్ మెట్రో రాయదుర్గంకు మెరుగైన కనెక్టివిటీని అందిస్తున్నాయి. వీటితోపాటు లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ అపార్ట్‌మెంట్లు, ఇంటర్నేషనల్ స్కూళ్లు, షాపింగ్ మాల్స్, స్టార్ హోటళ్లు అక్కడే ఏర్పాటు చేస్తుండటంతో రాయదుర్గం ప్రాంతంలో ఇప్పుడు భూములు భారీ ధర పలుకుతున్నాయి.

# పెద్ది ప్రాబ్లమ్ సాల్వడ్..

**హైదరాబాద్,** కొంతకాలం గా టాలీవుడ్ లో జరుగుతున్న వివాదాన్ని మన కళ్లారా చూస్తూనే ఉన్నాం. ఎక్సిభిటర్స్ మాకు కమిషన్ బేసిస్ మీద సినిమాలను రన్ చేసుకునే అవకాశం ఇవ్వాలని , అది 'పెద్ది' నుండే మొదలు అవ్వాలని పెద్ద ఎత్తున హల్చల్ చేశారు. కానీ నిర్మాతలు అందుకు ఒప్పుకోలేదు. 'పెద్ది' విషయం లో ఇప్పటి వరకు విధానం ఆలోచించే అవకాశం రాలేదని , చర్చల ద్వారా , కొన్ని కండీషన్స్ ని వాళ్ళు ఒప్పుకుంటూనే మేము కమిషన్ బేసిస్ మీద ఈ చిత్రాన్ని రన్ చేయడానికి ఒప్పుకుంటామని నిర్మాతలు తేల్చి చెప్పారు. దీనిపై కొన్ని రోజులు వివాదం నడుస్తూనే ఉన్నింది. అయితే రీసెంట్ గానే ఎక్సిభిటర్లు మెగాస్టార్ చిరంజీవి ని కలవడం , అదే విధంగా నిర్మాతలు ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని కలవడం తో ఈ సమస్యకు ఒక పరిష్కారం దొరికింది.'పెద్ది' చిత్రాన్ని రెంటల్ బేసిస్ మీద నడిపేందుకు ఎక్సిభిటర్లు ఒప్పుకున్నారు. కానీ ఒకవేళ తెలంగాణ లో టికెట్ రేట్స్ హైక్స్ కి ప్రభుత్వం అనుమతిస్తే , అందులో నుండి వచ్చే కలెక్షన్స్ లో 7.5 వాటా మాకు ఇవ్వాలని ఎక్సిభిటర్లు షరత్తు పెట్టడం , అందుకు నిర్మాతలు కూడా ఒప్పుకోవడం తో , వివాదం ఇక్కడితో ముగిసింది. దీంతో జూన్ 4 న తెలంగాణ లో ఒకవేళ టికెట్ రేట్స్ పెంచుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇస్తే , ఈ చిత్రం కమిషన్ బేసిస్ మీదనే రన్ అయ్యే అవకాశాలు ఉంటాయి. లేదంటే రెంటల్ బేసిస్ మీదనే రన్ అవుతాయి. దిల్ రాజు బృందం కూడా 7.5 శాతం కమిషన్ కి ఒప్పుకోవడం , ఎలాగో దిల్ రాజు ప్రభుత్వం లో ఉన్నాడు కాబట్టి , టికెట్ హైక్స్ కి ఎలాంటి అడ్డంకి పెట్టే అవకాశం లేకపోవడం తో , కచ్చితంగా ఈ చిత్రానికి టికెట్ హైక్స్ వస్తుందని అంటున్నారు విశ్లేషకులు.దీంతో ప్రస్తుతానికి 'పెద్ది' ముందు ఉన్నటువంటి చిక్కుముడులు తెరపడినట్టే అయ్యింది. మరి రాబోయే రోజుల్లో ఇంకా ఏమైనా ట్విస్టులు రాబోతున్నాయా లేదా అనేది చూడాలి. ఇకపోతే ఈ సినిమాకు జూన్ 3 న ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ప్రీమియర్ షోస్ ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రీమియర్ షోస్ టికెట్ రేట్స్ 600 రూపాయిల వరకు ఉండే అవకాశాలు ఉన్నాయి. ఆంధ్ర ప్రదేశ్ లో ఈ ప్రీమియర్ షోస్ తో పాటుగా, రోజుకి 5 షోస్ ప్రదర్శించేందుకు అనుమతి ఇవ్వనుంది కూటమి సర్కార్. ఇక మొదటి రోజు ఓపెనింగ్ వసూళ్లు ఏ రేంజ్ లో ఉండబోతున్నాయి చూడాలి.

# టీడీపీకి గేమ్ ఛేంజర్ కానున్న మహిళా రిజర్వేషన్

**విజయవాడ,** మహానాడు వేదికగా టీడీపీ చరిత్రాత్మక ప్రకటన చేసింది. మహిళా రిజర్వేషన్ బిల్లుతో సంబంధం లేకుండానే.. మహిళలకు 33 శాతం సీట్లు ఇవ్వబోతున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు మహానాడులో తీర్మానం చేశారు. ఈ ఒక్క ప్రకటన.. ఏపీ రాజకీయాన్ని ఎలా మార్చబోతోంది. విపక్షాలకు ఒక రకంగా ఇది టీడీపీ విసిరిన సవాల్ అనుకోవచ్చా.. ఇప్పుడు వైసీపీ స్టాండ్ ఎలా ఉండే అవకాశం ఉంది..మహానాడు మొదటిరోజే చరిత్రలో నిలిచే పోయే సంఘటన కనిపించింది. గతానికి భిన్నంగా హైబ్రిడ్ మోడల్‌లో మహానాడు నిర్వహిస్తున్న టీడీపీ.. పూర్తిగా డిజిటల్ వేదికపై మీటింగ్స్ నిర్వహిస్తోంది. స్త్రీశక్తి అనే థీమ్‌తో ఈసారి మహానాడు నిర్వహిస్తున్న టీడీపీ.. మహిళా సాధికారత, యువత పాత్ర, సామాజిక సమతుల్యత లాంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ కార్యక్రమాలను రూపొందించింది. ఐతే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహానాడు వేదిక నుంచి నారా లోకేష్.. భారీ అనౌన్స్‌మెంట్ చేశారు. మహిళల కోసం టీడీపీ తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని మహానాడు వేదికపై నుంచి ప్రకటించారు. మహిళా రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా.. భవిష్యత్‌లో అన్ని ఎన్నికల్లో మహిళలకు 33శాతం సీట్లు రిజర్వ్ చేయాలని టీడీపీ నిర్ణయించింది. ఇదే ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్‌టాపిక్ అవుతోంది.ఎన్నికల టైమ్‌లో చాలా పార్టీలు మహిళా సాధికారత గురించి మాట్లాడతాయని.. ఐతే ఎలక్షన్స్ తర్వాత మహిళలను మర్చిపోతాయని.. టీడీపీ విధానం.. నినాదం రెండూ మహిళల అభ్యున్నతే అన్నారు లోకేశ్. మహిళల విషయంలో గతంలో టీడీపీ చారిత్రక నిర్ణయాలు తీసుకుంది. ఎన్టీఆర్ మహిళలకు ఆస్తి హక్కు కల్పిస్తే.. చంద్రబాబు సీఎంగా విద్యా సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఇప్పుడు పార్టీ అభ్యర్థుల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించడంతో టీడీపీ మరో మందుడుగు వేసింది. టీడీపీ నిర్ణయం అమల్లోకి వస్తే.. పొలిటికల్‌గా గేమ్‌ఛేంజర్‌గా మారే అవకాశాలు క్లియర్‌గా కనిపిస్తున్నాయ్. నెక్స్ట్ ఎన్నికల్లో సైకిల్ పార్టీకి అతి పెద్ద ఆయుధంగా మారే అవకాశం ఉంటుంది. ఐతే అటు టీడీపీ ఒక్క స్టేట్‌మెంట్‌తో.. విపక్షాలకు సవాల్ విసిరినట్లు కూడా అయింది. ఇది రాజకీయాన్ని మలుపు తిప్పే అవకాశాలు లేకపోలేదనే చర్చ జరుగుతోంది.రిజర్వేషన్ బిల్లుతో సంబంధం లేకుండా.. మహిళలకు 33శాతం సీట్లు ఇస్తే మాత్రం.. దేశ రాజకీయాల్లోనే టీడీపీ ప్రత్యేక స్థానంలో ఉంటుంది. ప్రకటనల సంగతి ఎలా ఉన్నా.. జాతీయ స్థాయిలో ఏ పార్టీ కూడా మహిళలకు కచ్చితంగా 33శాతం టికెట్లు ఇవ్వడం లేదు. చాలా పార్టీలు 10 నుంచి 18శాతం మాత్రమే ఇస్తున్నాయ్. ఇదంతా ఎలా ఉన్నా.. ఇప్పుడు టీడీపీ చేసిన ప్రకటన వైసీపీని టార్గెట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయ్. మహిళలకు సీట్ల కేటాయింపు విషయంలో ఆ పార్టీలు ఇదే దారిలో ప్రయాణించాల్సి ఉంటుంది. వాళ్లు కూడా 33శాతం సీట్ల కేటాయింపునకు ఫిక్స్ కావాల్సి ఉంటుంది. . చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు మహిళలకు కల్పించే వీలుగా ఈ బిల్లును ప్రవేశపెట్టగా.. మూడింట రెండు వంతు మెజారిటీ లేక వీగిపోయింది ఈ బిల్లు. అయితే ఈ బిల్లు ఇప్పుడు మరోసారి పార్లమెంట్లో ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి నారా లోకేష్ ఈ మహిళా బిల్లు పై గట్టిగానే మాట్లాడుతున్నారు. జాతీయస్థాయిలో మిగతా రాజకీయ పక్షాలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ తరుణంలో మహానాడు వేదికగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై సంచలన నిర్ణయం తీసుకుంది తెలుగుదేశం పార్టీ. బిల్లు ఆమోదంతో సంబంధం లేకుండా 2029 ఎన్నికల్లో 33 శాతం మహిళలకు టిక్కెట్లు ఇస్తామని ప్రకటించింది తెలుగుదేశం.స్త్రీ శక్తి థీమ్ తో సాగిన మహానాడు లో అదే మహిళలకు సంబంధించి కీలక ప్రకటన చేశారు నారా లోకేష్. పార్లమెంటులో బిల్లుతో సంబంధం లేకుండా 2029 ఎన్నికల్లో 33% మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించారు. అంటే వచ్చే ఎన్నికల్లో దాదాపు 50 మంది మహిళా ఎమ్మెల్యేలు సభకు రానున్నారు అన్నమాట. ఇప్పటికే నాయకులు తమ మహిళా వారసులను రంగంలోకి దించారు. పార్టీతో పాటు పాలనలో భాగస్వామ్యం కల్పిస్తున్నారు. ఇప్పుడు మహానాడు వేదికగా యువరాజు లోకేష్ ప్రకటనతో సీనియర్ నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మహానాడు వేదికపై పెద్ద చర్చ నడిచింది. అయితే చాలామంది నేతలు కుమార్తెలు లేకపోవడంతో కోడళ్లను రంగంలోకి దించేందుకు అక్కడి నుంచే ప్రణాళిక మొదలుపెట్టారు. మొత్తానికైతే మహానాడు వేదికగా తొలి రోజు ఒక సంచలన నిర్ణయం వెలువడటం నిజంగా గొప్ప విషయమే.దీంతో రాజకీయ సమీకరణాలే మారిపోతాయ్. టీడీపీ చేసిన ఒక్క ప్రకటన.. ఆ పార్టీ విధానాలకు అనౌన్స్‌మెంట్‌లా మాత్రమే కాదు.. రాజకీయాన్ని మార్చబోయే అస్త్రంగా కనిపిస్తోంది. మిగతా పార్టీల రియాక్షన్ ఎలా ఉంటుంది.. ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో చూడాలి

# తెలంగాణలో భారీగా తగ్గనున్న టెక్ట్స్ బుక్స్

**హైదరాబాద్,** 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో తల్లిదండ్రులు, విద్యార్థులకు భారీ ఊరటను ఇచ్చే వార్త వచ్చింది. విద్యార్థుల పుస్తకాల ధరలు భారీగా తగ్గడం విశేషం. ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి పాఠ్య పుస్తకాల ధరలు తగ్గడంతో.. ఆర్థికంగా కాస్త రిలీఫ్ లభించింది. గరిష్ఠంగా 20 శాతం వరకు ధరలు తగ్గడంతో విద్యార్థులు ఆనందంగా ఫీల్ అవుతున్నారు. ఒకవైపు యుద్ధం కారణంగా అన్ని రకాల వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేళ.. పుస్తకాల ధరలు తగ్గడం గమనార్హం. అయితే ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం కొన్ని రోజుల క్రితం పుస్తకాల ప్రింటింగ్ కోసం.. టెండర్లను పిలిచింది. ఈ టెండర్లలో 3 ప్రింటింగ్ సంస్థలు గతం కంటే 20 శాతం తక్కువగా కోట్ చేయడంతో పుస్తకాల ధరలు దిగి వచ్చాయి.గతంలో ఒక్కో పేజీ ప్రింటింగ్ ధర 54 పైసలు ఉండగా.. అది ప్రస్తుతం 44.50 పైసలకు దిగి వచ్చింది. ఉదాహరణకు 1వ తరగతిలోని 3 పుస్తకాలు కలిపి గతేడాది రూ.247లు కాగా.. ఈసారి రూ.209కి తగ్గాయి. ఇఖ 10వ తరగతిలోని మొత్తం 8 పుస్తకాల ధర గత విద్యా సంవత్సరంలో రూ.1,078 ఉండగా ఈసారి రూ.900కి తగ్గింది. అంటే.. ఒక్క టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఈ ఏడాది రూ.178 ఆదా అయ్యాయి. జూన్ 5వ తేదీ నుంచి కొత్త పుస్తకాలు మార్కెట్లో అందుబాటులోకి రానున్నాయి.మరోవైపు.. పుస్తకాల ధరలు తగ్గినంత మాత్రాన.. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రింటింగ్‌లో, బైండింగ్‌లో ఎలాంటి రాజీ లేకుండా.. మెరుగైన క్వాలిటీతో లామినేటెడ్ పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. ఇక.. వరుసగా 4వ ఏడాది కూడా పాఠ్యపుస్తకాల ధరలు తగ్గడంతో.. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పింది. 2023-24 అకడమిక్ ఇయర్‌లో 10వ తరగతి విద్యార్థుల పుస్తకాల కోసం రూ.1,482 ఖర్చు కాగా.. 2025-26లో అది రూ.1,078కు దిగి వచ్చింది. తాజా తగ్గింపుతో ఈ ఏడాది టెన్త్ టెక్ట్స్ బుక్స్ సెట్ ధర రూ.900కు తగ్గింది.అదే విధంగా 9వ తరగతి పుస్తకాల సెట్ ధర రూ.927 నుంచి రూ.776కు (రూ.151) తగ్గింది. 8వ తరగతి పుస్తకాల సెట్ ధర రూ.825 నుంచి రూ.690కి (రూ.135) తగ్గాయి. ప్రైమరీ క్లాసులకు కూడా ఒక్కో సెట్‌పై రూ.35 నుంచి రూ.60 వరకు ధరలు తగ్గాయి. ఇక సబ్జెక్టుల వారీగా పుస్తకాల ధర తగ్గింపు చూస్తే.. టెన్త్ మ్యాథ్స్ టెక్ట్స్ బుక్ ధర గతంలో రూ.225 ఉండగా.. ఇప్పుడు రూ.187కు తగ్గింది. సోషల్ పుస్తకం రూ.192 నుంచి రూ.160కి తగ్గింది. 9వ తరగతి మ్యాథ్స్ బుక్ రూ.201 నుంచి రూ.167కు.. 8వ తరగతి మ్యాథ్స్ రూ.205 నుంచి రూ.171కి తగ్గిందిఅయితే గతం కంటే ఇప్పుడు.. ముడి సరుకుల ధరలు 20 శాతం పెరిగినప్పటికీ.. పబ్లిషర్లు మాత్రం గతేడాది కంటే తక్కువ ధరకే పుస్తకాలను ముద్రించేందుకు ముందుకు రావడం గమనార్హం. గతేడాది ఎల్1 గా నిలిచిన ఆర్క్‌బర్డ్ సంస్థ పేజీకి 54 పైసలు కోట్ చేయగా.. ఈ ఏడాది నవతెలంగాణ ప్రింటర్స్, డీకే పబ్లికేషన్స్, సూపర్ ప్రింటర్స్ సంస్థలు కేవలం 44.50 పైసలకే పుస్తకాలను ప్రింట్ చేస్తామని ప్రకటించి.. ఎల్-1గా నిలిచాయి.

## వైద్య మంత్రి ఇలాకాలో ఉచిత వైద్య సేవలు

**అనంతపురం,** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే పనిలో ఉంది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రుల్లో అవసరమైన యంత్రాలు, పరికరాలను ఏర్పాటు చేస్తోంది. వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సొంత నియోజకవర్గం ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి 21 రకాల యంత్రాలు, పరికరాలు మంజూరయ్యాయి. మంత్రి చొరవ తీసుకోవడంతో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల పరీక్షలు, శస్త్రచికిత్సలను పైసా ఖర్చు లేకుండా ఉచితంగా చేయించుకోవచ్చని చెబుతున్నారు అధికారులు.ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో ఫుల్లీ ఆటోమేటిక్ బయోకెమిస్ట్రీ అనలైజర్ యంత్రం అందుబాటులోకి వచ్చింది. రక్తం, మూత్రం శాంపిల్స్‌ను సేకరించి తక్కువ సమయంలోనే రిపోర్ట్ అందిస్తారు. అతి తక్కువ సమయంలో ఎక్కువ పరీక్షలు చేయొచ్చు. ఈ ఆస్పత్రిలో ప్రతిరోజూ 40 నుంచి 50 మందికి రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నారు. ధర్మవరం ఆస్పత్రిలో చేసే 20 రకాల పరీక్షలు ప్రైవేట్ ల్యాబ్‌లో చేయిస్తే రూ.2,500 నుంచి రూ.4 వేల వరకు ఖర్చవుతుంది. అదే ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ సేవలు పూర్తిగా ఉచితం.అలాగే ఫోర్ ప్రోబ్ అల్ట్రా సోనోగ్రామ్ విత్ కలర్ డాప్లర్ యంత్రం కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. కిడ్నీలు, లివర్, గాల్ బ్లాడర్, పాంక్రియాస్ వంటి సమస్యల్ని గుర్తిస్తుంది. ఫ్యాటీ లివర్, కిడ్నీలో రాళ్లు, గాల్ బ్లాడర్‌లో రాళలు, అపెండిసైటిస్, గుండెకు సంబంధించిన సమస్యల్ని తెలుసుకోవచ్చు. ఈ యంత్రం ద్వారా మహిళలకు గర్భసంచికి సంబందించిన సమస్యలు, గర్భిణుల్లో బిడ్డ గుండె పనితీరును తెలుసుకోవచ్చంటున్నారు.డబుల్ పంచ్ ల్యాప్రోస్కోపీ మెషిన్ కూడా అందుబాటులోకి వచ్చింది. సాధారణ శస్త్రచికిత్సలు, అపెండిక్స్ తొలగింపు, హెర్నియాను బాగు చేయడం, పిత్తాశయంలో రాళ్లు తొలగించవచ్చంటున్నారు. ఆయా ఆపరేషన్లు బయటకు చేయించుకోవాలంటే రూ.30వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతుంది.. ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో మాత్రం పూర్తిగా ఉచితంగానే ఆపరేషన్లు చేస్తున్నారు. ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చిన కొత్త యంత్రాలు, వైద్య పరికరాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు సూపరిండెంటెంట్ వైద్య సేవల్ని 24 గంటలు అందిస్తున్నామని.. ఆపరేషన్లు చేస్తున్నామన్నారు.

### పుట్టపర్తికి వరుస వరాలు

మరోవైపు శ్రీసత్యసాయి జిల్లాకు ప్రభుత్వం వరుసగా శుభవార్తలు వినిపిస్తోంది, సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో డీఆర్‌డీవో ఫిఫ్త్ జనరేషన్ స్టెల్త్ యుద్ధ విమాన తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా మే 15న ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగనున్నట్లు సమాచారం. ఈ ప్లాంట్‌లో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు తయారు చేస్తారు. ఈ ప్లాంట్ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీఆర్‌డీవోకు 600 ఎకరాల భూమిని కేటాయించింది. మరో 400 ఎకరాలను త్వరలోనే కేటాయించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2029 నాటికి ఈ ప్లాంట్ ప్రారంభించాలనే ఉద్దేశంతో అధికారులు చర్యలు చేపడుతున్నారు.మరోవైపు శ్రీసత్యసాయి జిల్లాను ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ హబ్‌గా అభివృద్ధి చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పాలసముద్రం వద్ద భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ రూ.500 కోట్లతో డిఫెన్స్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. మడకశిరలో కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థ డిఫెన్స్ ఎనర్జిటిక్స్ తయారీ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. ఇప్పుడేమో శ్రీసత్యసాయి జిల్లాలో రూ.51 వేలకోట్లతో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఏపీ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ఆమోదం తెలిపింది. మంత్రివర్గం ఆమోదం అనంతరం ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది.

# ఏకగ్రీవాలను అడ్డుకోండి

**గుంటూరు** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో సరికొత్త పాచిక వేశారు. ఎక్కడ ఏకగ్రీవాలు అనే మాట లేకుండా చూడాలని చూస్తున్నారు. పొరపాటున ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిలపై వేటు వేస్తానని హెచ్చరించారు. తద్వారా ఎక్కడ పార్టీ నేతలు తప్పించుకోకుండా ఉండేందుకు ముందుగానే వారిని కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలు అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. ప్రజలు కూడా ఎక్కువగా ఏకగ్రీవాలకు మొగ్గు చూపుతారు. ఎందుకంటే స్థానికంగా రాజకీయ అంశాలు ఎక్కువగా ప్రభావం చూపుతాయి. గ్రామ పెద్దల ప్రమేయంతో చాలాచోట్ల ఏకగ్రీవాల వైపే చూస్తారు. ముఖ్యంగా పంచాయతీలకు ఏకగ్రీవాలు అనేవి సర్వసాధారణం. కానీ ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ఏకగ్రీవం అన్న మాట వినిపించకూడదు అంటూ సొంత పార్టీ నేతలను హెచ్చరించడం బ్లాక్మెయిలింగ్ కిందకి వస్తుంది.2021లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మండలం మొత్తానికి ఒకే పదవిగా ఉండే జడ్పిటిసిలను సైతం ఏకగ్రీవం చేసుకున్నారు. పంచాయితీల గురించి చెప్పనవసరం లేదు. ఇక ఎంపీటీసీల గురించి చెప్పనవసరం లేదు. అన్ని ఏకగ్రీవాలే. ఎందుకంటే అధికార పార్టీగా ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలను నిరసిస్తూ ప్రాదేశిక ఎన్నికలను బహిష్కరించారు చంద్రబాబు. అప్పట్లో అంతలా ఉండేది ఏకగ్రీవాల పర్వం. ఒక అధికారాన్ని చేపట్టిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ప్రతిపక్షంలోకి వెళ్లాక ఏకగ్రీవాలు వద్దు అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏ రీతిలో ఏకగ్రీవాలను చేసుకుందో జగన్మోహన్ రెడ్డికి తెలియంది కాదు. అయితే ఆయన తెలివిగా ఇప్పుడు ఆ బాధ్యతను నియోజకవర్గం అప్పగించారు. అంటే తప్పకుండా పోటీ ఉంటే పార్టీ ఓటు బ్యాంకు ఎటు వెళ్లదన్నది జగన్మోహన్ రెడ్డి ఆలోచన. అయితే దీనిని ఎక్కువ మంది వైసీపీ నేతలు తప్పుపడుతున్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఇదే మనిషి ఏకగ్రీవాలు చేయమన్నారు. ఇప్పుడు ఏకగ్రీవాలు అంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఇది ఎక్కడి చోద్యం అని ఆవేదన వ్యక్తం చేస్తున్న వారు ఉన్నారు పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లతోపాటు మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జిలతో సమావేశం అయ్యారు జగన్మోహన్ రెడ్డి. అధికార పార్టీ మహానాడు నిర్వహిస్తున్న దృష్ట్యా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధపడిపోతుందన్న వార్త ఉంది. అదే అజెండాతో ఈరోజు సమావేశం నిర్వహించారు జగన్మోహన్ రెడ్డి.. స్థానిక సంస్థల నిర్వహణ బాధ్యతను నియోజకవర్గ ఇన్చార్జిలే తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే వచ్చే ఎన్నికల్లో టికెట్ వస్తుందో లేదో? తమకే వస్తుందో లేదో? అనే ఆలోచనలో ఉన్నారు కొందరు ఇన్చార్జిలు. కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్లాంటివారు అయితే అసలు యాక్టివ్ కాలేదు. అటువంటి వారికి ఎటువంటి ఆదేశాలు ఇవ్వకుండా.. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలకు తమను కమిట్మెంట్ చేయడం పై ఆగ్రహంగా ఉన్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు

# పొలాల్లో శాటిలైట్ నిఘా

తెలంగాణలో పెరుగుతున్న పంట వ్యర్థాల దహనం ఘటనలు, ప్రాణ నష్టాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. కూలీల కొరత, పశువుల సంఖ్య తగ్గడం వల్ల రైతులు వ్యర్థాలను తగులబెడుతుండటంతో భూపాలపల్లి, నిర్మల్, హనుమకొండ జిల్లాల్లో నలుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో శాటిలైట్ నిఘా ద్వారా పంట వ్యర్థాలు తగులబెట్టేవారిని గుర్తించి ఎన్జీటీ నిబంధనల ప్రకారం రూ.2500 నుంచి రూ.15 వేల వరకు జరిమానాలతో పాటు, ఎయిర్ యాక్ట్ కింద మూడేళ్ల జైలు శిక్ష విధించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఇంతకాలం ఉత్తర భారతదేశానిని, ముఖ్యంగా పంజాబ్ రాష్ట్రానికి పరిమితమనుకున్న పంట వ్యర్థాల దహనం ముప్పు ఇప్పుడు తెలంగాణను కూడా చుట్టుముడుతోంది. వరి, మొక్కజొన్న సాగు తర్వాత మిగిలిపోయే వ్యర్థాలకు రైతులు నిప్పు పెడుతుండటం రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే కొత్త పర్యావరణ, ప్రాణ నష్టాల సవాలుగా మారుతోంది. ఇటీవలి కాలంలో పలు జిల్లాల్లో పంట వ్యర్థాలను తగులబెడుతూ పలువురు రైతులు ప్రాణాలు కోల్పోవడం, వందల క్వింటాళ్ల పంట నష్టం వాటిల్లడం పట్ల తెలంగాణ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్య తీవ్రరూపం దాల్చకముందే అడ్డుకట్ట వేసేందుకు సర్కార్ నడుం బిగించింది.గత కొద్ది నెలలుగా రాష్ట్రంలో ఈ తరహా ఘటనలు గణనీయంగా పెరిగాయి. సాధారణంగా పంజాబ్ వంటి రాష్ట్రాల్లో తదుపరి పంటకు సమయం తక్కువగా ఉండటం వల్ల రైతులు వ్యర్థాలను తగులబెడతారు. అయితే తెలంగాణలో పరిస్థితి వేరు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీల కొరత తీవ్రం కావడం, పశువుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడమే ఇందుకు ప్రధాన కారణాలని అధికారులు విశ్లేషిస్తున్నారు. గతంలో ఎండు గడ్డిని పశువుల మేతగా ఉపయోగించేవారు, కానీ ఇప్పుడు పశువులు లేకపోవడంతో పొలాలను త్వరగా శుభ్రం చేసుకునేందుకు రైతులు సులభమైన మార్గంగా భావించి నిప్పు పెడుతున్నారు. ఇప్పటికే ఖమ్మం, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో ఈ సమస్య తీవ్రమైంది. ఖమ్మం జిల్లా పాథర్లపాడులో ఇలా పెట్టిన మంటలు పక్క పొలాలకు వ్యాపించి వందల క్వింటాళ్ల దిగుబడి బూడిదైంది.పంట వ్యర్థాల దహనం కేవలం పర్యావరణానికే కాదు, రైతుల ప్రాణాలకూ ముప్పుగా మారింది. మే 24న భూపాలపల్లి జిల్లాలో చంద్రమౌళి అనే రైతు వ్యర్థాలను తగులబెడుతూ మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యాడు. ఆ ఘోరాన్ని కళ్లారా చూసిన ఆయన భార్య భాగ్యమ్మ గుండె ఆగి అక్కడికక్కడే మృతి చెందింది.

మే 13న నిర్మల్ జిల్లాలో మంద గంగన్న అనే రైతు మొక్కజొన్న వ్యర్థాలకు నిప్పు పెట్టగా.. ఆ మంటలు పక్కనే ఉన్న వరి పొలానికి వ్యాపించాయి. వాటిని ఆర్పే క్రమంలో ఆయన కాలిబూడిదయ్యాడు. మే 10న హనుమకొండ జిల్లాలో జి. జయపాల్ రెడ్డి అనే వృద్ధ రైతు వ్యర్థాలకు నిప్పు పెడుతూ ప్రమాదవశాత్తు జారిపడి మంటల్లో కాలి ప్రాణాలు కోల్పోయాడు.ఈ ఉదంతాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం రైతులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంట వ్యర్థాల దహనాన్ని కేంద్ర ప్రభుత్వం, పర్యావరణ సంస్థలు అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నాయని ఇది గాలి నాణ్యతతో పాటు భూసారాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. ఇకపై పొలాల్లో మంటలు పెట్టే రైతులను గుర్తించేందుకు శాటిలైట్ ఇమేజరీ ఉపయోగించబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.నిబంధనలు ఉల్లంఘిస్తే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలు, ఎయిర్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి మూడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. అలాగే ఎన్జీటీ నిబంధనల ప్రకారం పర్యావరణ పరిహారం కింద జరిమానాలు విధిస్తారు. 2 ఎకరాల లోపు ఉన్న రైతులకు రూ2500, 2 నుంచి 5 ఎకరాల లోపు ఉన్నవారికి రూ5 వేలు, 5 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు ప్రతి ఘటనకు రూ15 వేల వరకు జరిమానా విధించనున్నారు. గ్రామాల్లో తక్షణమే అవగాహన సదస్సులు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు.

# వ్యక్తిపై దుండగుల దాడి

**జనగామ** పాలకుర్తి మండలం కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో, శాతాపురం గ్రామనికి చెందిన తీగల ధర్మారావు పై గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. తీవ్ర రక్తస్రావానికి గురైన ధర్మారావును స్థానికులు ఆసుపత్రికి తరలించారు. కడుపులో, వీపులో, చేయి పై కత్తిపోట్లు పొడిచిన గుర్తు తెలియని వ్యక్తులు. ధర్మారావు పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. పోలీసులు దుండగుల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు.

## వానలు రాకముందే పూడికలు తీయండి

**మేడ్చల్** సరూర్నగర్ చెరువు పూడికలు తీస్తామన్నారు. చెరువును సగం ఎండబెట్టారు. చెరువు ప్రక్షాళన చేస్తాము అని అన్నారు అధికారులు, ఎల్బీ కాంగ్రెస్ గొప్పలు చెప్పారు. కానీ ఏమీ చేయలేదని బీజేపీ నేతలు ఆరోపించారు, ఎండాకాలం ముగిసిపోయింది. వర్షాకాలం వచ్చేస్తోంది. ఇప్పటికీ డ్రైనేజీ నీళ్లు అలాగే ఉన్నాయి. పూడికలు కూడా పూర్తిగా తీయలేదు. రేపు భారీ వర్షాలు పడితే ఆ నీళ్లు ఎక్కడికి వెళ్తాయి..? మళ్లీ చెరువులోకే పంపిస్తారా అని ప్రశ్నించారు.
పూడికలు తీశాం" అని కాగితాల మీద పనులు చూపించి బిల్లులు డ్రా చేసుకోవడానికే ఈ డ్రామాలు చేస్తున్నారు. ప్రజల డబ్బుతో చేసే పనులు. ప్రజల ప్రాణాలను కాపాడాలి గానీ, ఫైళ్లలో ఫోటోలు పెట్టి కమిషన్లు కొట్టడానికి కాదు. ఇప్పటికైనా అధికారులు, కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొనాలి.ప్రజాధనాన్ని వృథా చేస్తూ, ప్రజల భద్రతను గాలికొదిలేస్తే ఒక రోజు ప్రజలే నిలదీస్తారు. జీతాలు తీసుకుంటే బాధ్యత కూడా తీసుకోండి. తక్షణమే నాళాలు, కుంటలు, చెరువులలో ఉన్న పూడికలను పూర్తిగా తొలగించండి. లేకపోతే నిర్లక్ష్యంతో జరిగే ప్రతి నష్టం? ప్రతి ప్రాణ హానికి బాధ్యత మీదేనని అన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ 103వ వర్ధంతి వేడుకలు

స్వర్గీయ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) 103వ వర్ధంతి సందర్భంగా సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ అధ్యక్షులు కుమార్ చౌదరి, వైస్ ప్రెసిడెంట్ ఎన్.కే. విజయ్ రాజ్, మరియు నాయకులు ఆనంద్, శివ, గోపాల కృష్ణ చౌదరి తదితరులు కలిసి యూసఫ్ గూడ లోని ఎల్లారెడ్డి గూడ లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, పాలాభిషేకం చేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అందించిన ఘనమైన పరిపాలన చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అయితే, ఇటీవల తెలంగాణకు చెందిన కొందరు నాయకులు ఎన్టీఆర్ గారిపై, ఆయన విగ్రహ ఆవిష్కరణపై చేస్తున్న దిగజారుడు వ్యాఖ్యలను సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి తీవ్రంగా ఖండిస్తోందని హెచ్చరించారు.

## ఫైనాన్షియర్లు నన్ను వేధించినట్లు
# ఇతరులను వేధించొద్దు

**- భార్య, ఇద్దరు పిల్లలను హతమార్చి తాను ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి**

**- ఫైనాన్సియర్ల వేధింపులే కారణమంటూ వాట్సాప్ స్టేటస్**

**వనపర్తి** ఖిల్లా ఘనపురం మండల సల్కిలాపురం గ్రామ శివారులోని 52 ఎకరాల మామిడితోటను గత ఆరేళ్లుగా లీజుకు తీసుకుంటున్న మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకూరు గ్రామానికి చెందిన గంగల నర్సింహులు(40) మామిడి తోట సాగు రుణం తీసుకున్నాడు. ఆరేళ్లుగా చేసిన రూ.60 లక్షల అప్పు, వడ్డీతో సహా రూ.1.20 కోట్లకు చేరగా, ఊర్లో ఉన్న ఇంటిపై రుణం తీసుకుని కొంత అప్పు తీర్చాడు.

మిగతా అప్పు తీర్చాలని ఫైనాన్షియర్లు వేధిస్తున్నారని, ఇంటికి నోటీస్ అంటించి బంగారం తీసుకెళ్లారని, తనను వేధించినట్లు ఇంకెవరినీ వేధించొద్దని వాట్సాప్ స్టేటస్ పెట్టాడు. వరుసకు అల్లుడైన వ్యక్తికి ఫోన్ చేసి భార్య ఎల్లమ్మ(33)ను ఉరి వేసి చంపేశానని, పిల్లలు(సాయినిహాల్(15), సాహితీశ్రీ(12))లను సంపులో పడేశానని, తాను కూడా చనిపోతున్నానని చెప్పాడు. ఉదయం మామిడి తోటకు వచ్చి చూడగా, విగత జీవులుగా పడి ఉన్న కుటుంబాన్ని చూసి బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు నర్సింహులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నాలుగు జిల్లాలకు
# ఆరెంజ్ అలెర్ట్

**విజయవాడ** గురువారం నాడు కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం వుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

గంటకు 40 నుండి 50 కిమీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం వుంది.ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వర్షం పడే సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్ల క్రింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడకూడదని హెచ్చరించింది.

# తెలంగాణలో ఆంధ్రా ఆటలు సాగావు

**హైదరాబాద్** పవన్ కళ్యాణ్, చంద్రబాబులకు సిగ్గు శరం ఉంటే హైదరాబాద్ వదిలి అమరావతికి వెళ్లిపోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామ్యేల్ అన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ ను అరెస్ట్ చేసేందుకు ఆంధ్రా పోలీసులు వస్తారా? ఇంకెక్కడి ఆంధ్రా.. గల్లా పట్టి నూకితే ఎప్పుడో పారిపోయారనిఅ న్నారు. మీ అయ్య జాగీరు ఉందా హైదరాబాద్లో? ఇక్కడ ఎందుకు ఉంటున్నారు? బతకమని వదిలేస్తే తెలంగాణను ఆగం చేద్దాం అని చూస్తావా చంద్రబాబు? నీ ఏడుపు ఏదో అమరావతిలో ఏడువు, లేకపోతే కుప్పంలో ఏడువు..అంతేకాని మా దగ్గర నీ ఆటలు సాగవని అన్నారు.

# రెండు బస్సులు ఢీ..ఒకరు మృతి

**మహబూబ్నగర్** జడ్చర్ల వద్ద 44వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాదు నుండి తిరుపతి వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును బెంగళూరు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఒక డ్రైవర్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. మృతదేహం మహబూబ్నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడు తిరుపతికి చెందిన అశోక్ రెడ్డి గా గుర్తించారు.

## వృద్ధురాలి అనుమానాస్పద మృతి మిస్టరీని 24 గంటల్లో ఛేదించిన కశింకోట పోలీసులు

**- బంధువురాలే హంతకురాలు**



**కశింకోట** కశింకోట గ్రామంలో సంచలనం సృష్టించిన వృద్ధురాలు దమ్ము నాగమ్మ (85) హత్య కేసు మిస్టరీని కశింకోట పోలీసులు అత్యంత సమర్థవంతంగా, కేవలం 24 గంటల వ్యవధిలోనే ఛేదించారు. అప్పుల బాధతో బంగారు నగ ల కోసం సొంత బంధువురాలే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసు విచారణలో తేలింది. నిందితురాలిని అరెస్ట్ చేసి, చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.నిందితురాలు సిమ్మ సత్య మృతురాలికి బంధువే. సిమ్మ సత్య అప్పుల బాధలు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. మృతురాలి వద్ద ఉన్న బంగారు చెవిదిద్దులను ఎలాగైనా దక్కించుకోవాలని పథకం వేసింది. ఈ నెల 16-05-2026 రాత్రి మృతురాలి ఇంటికి వెళ్లి, మొదట ఆ నగలను తాకట్టు పెట్టుకోవడానికి ఇవ్వమని అడిగింది. నాగమ్మ నిరాకరించడంతో, ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకుని, మంచంపై టీవీ చూస్తున్న నాగమ్మ మెడకు తను ధరించిన చున్నీతో గట్టిగా బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేసింది. హత్య అనంతరం ఉదయం నాగమ్మ చెవులకున్న బంగారు దిద్దులను దొంగిలించి, కొప్పాక గ్రామానికి చెందిన ఒక మహిళ వద్ద రూ.50,000/-లకు తాకట్టు పెట్టింది. హత్యకు ఉపయోగించిన చున్నీని కశింకోట కాలువలో పారేసింది. సాంకేతిక ఆధారాలు, నమ్మకమైన సమాచారంతో అనుమానితురాలైన సిమ్మ సత్యను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించింది.

## బక్రీద్ సందర్భంగా ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ డి.జానకి



**మహబూబ్ నగర్** బక్రీద్ పండుగ సందర్భంగా మహబూబ్నగర్ పట్టణంలోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డి. జానకి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు మరియు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీసుకుంటున్న చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.అలాగే జిల్లాలోని అన్ని ఈద్గా ప్రాంగణాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పండుగ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జిల్లా ప్రజలకు, ముఖ్యంగా ముస్లిం సోదరులు, సోదరీమణులందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బక్రీద్ పండుగను సోదరభావంతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.
బందోబస్త్ లో అదనపు ఎస్పి ఔః రత్నం, ంఖీ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆూఖ వెంకటేశ్వర్లు, ఆఅఖీః ఆూఖ రమణా రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, ూః ఇన్స్పెక్టర్ మోతిరాం, అఆూ తినిబజూవఇబినీతీ కృష్ణా, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి మరియు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈద్గాలను సందర్శించిన
# వరంగల్ పోలీస్ కమిషనర్




**వరంగల్** బక్రీద్ పండుగను పురస్కరించుకొని హన్మకొండలోని బొక్కలగడ్డ ఈద్గాను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ గురువారం సందర్శించి పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ప్రార్థనలు సజావుగా జరిగేందుకు అధికారులు చేపట్టినచర్యలపై సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, హన్మకొండ నర్సింహారావు అడిగి తెలుసుకున్నారు.

## ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని పేదల నుండి రూ.20 కోట్లు కాజేసిన తెలంగాణ బీజేపీ నాయకుడు

**– డబ్బులు వసూలు చేసి ప్రభుత్వ భూమిలో పట్టాలు చేయించిన వైనం**

**హైదరాబాద్** హైదరాబాద్ మేడ్చల్ జిల్లా చెంగిచర్ల గ్రామంలోని సర్వే నంబర్ 58లో 1500 మందికి ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని హిమాయత్నగర్ డివిజన్ విఠల్ వాడికి చెందిన బీజేపీ సెంట్రల్ జిల్లా సెక్రటరీ రూ.20 కోట్లు వసూలు చేసిన భాగోతం బయటపడింది. 60 గజాల స్థలం ఇప్పిస్తానని ఒక్కొక్కరి నుండి రూ.60 వేల నుండి రూ.3 లక్షలు వసూలు చేసి పట్టాలు కూడా సదరు బీజేపీ నాయకుడు ఇచ్చాడు. అయితే పట్టాలు తీసుకుని భూమి వద్దకు వెళ్లి చూడగా, అది ప్రభుత్వ భూమి అని తెలిసి భూ పరిపాలన కార్యాలయానికి వెళ్లి అడిగితే అవన్నీ నకిలీ పట్టాలని అధికారులు తేల్చారు. దీంతో సదరు బీజేపీ నాయకుడిని నిలదీసేందుకు వెళితే సీపీఐ వాళ్లు ఇచ్చారని చెప్పండి అంటూ బుకాయించాడని, డబ్బులు తిరిగి ఇవ్వమంటే దిక్కున్న చోట చెప్పుకోండి అని బెదిరించాడని భాదితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బీజేపీ నాయకుడిని కఠినంగా శిక్షించి, తమకు న్యాయం చేయాలని బాధితుల డిమాండ్ చేసారు.

### అన్యాయంగా బీఆర్ఎస్ నేతలను

## జైలుకు పంపించారు

**హైదరాబాద్** బెల్ట్ షాపులు వద్దని పోరాడిన బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా జైలుకు పంపించారు. స్టేషన్ బెయిల్ వచ్చే సెక్షన్ల ప్రకారం కేసులు పెట్టినా కావాలనే అర్ధరాత్రి జడ్జి ముందు ప్రవేశపెట్టి జైలుకు పంపించారని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేసిన పోలీస్ అధికారుల మీద చర్యలు తీసుకునే వరకు పోరాడతామని అన్నారు.

## ఈద్గాల దగ్గర పోలీసు బందోబస్తు



**మెదక్** బక్రీద్ సందర్భంగా మెదక్ పట్టణంలోని నవాబ్పేట్, గాంధీనగర్ ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పరిశీలించారు. పండుగ ప్రశాంత వాతావరణంలో జరగాలని పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈద్గాల పరిసర ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్, మొబైల్ పెట్రోలింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. ప్రజలు పరస్పర సహకారంతో శాంతియుతంగా బక్రీద్ వేడుకలు జరుపుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, అనుమానాస్పద ఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు నిర్భయంగా పండుగ జరుపుకునేలా మెదక్ జిల్లా పోలీసు శాఖ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తోందని ఎస్పీ పేర్కొన్నారు.

## సిరిపూర్లో చిరుత సంచారం

**నిజామాబాద్** నిజామాబాద్ జిల్లా సిరిపూర్ లో చిరుత సంచారం కలకలం రేపింది. రాత్రి సమయంలో గ్రామంలోకి చిరుత వచ్చింది. పశువులను తినడానికి వచ్చిన చిరుత కుక్కలు గట్టిగా అరవడంతో పారిపోయింది. సీసీటీవీ ఫుటేజ్లో చిరుత కనిపించడంతో భయాందోళనలో గ్రామస్తులు వున్నారు. స్థానికుల పిర్యాదు తో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమైయారు.

### కరీంనగర్ నగరంలో

## బాల్య వివాహాల చట్టాలపై అవగాహన



**కరీంనగర్** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ శివాజినగర్ అంగన్వాడీ కేంద్రం, అంబేద్కర్ భవన్ హాల్ లో 27వ డివిజన్ కార్పొరేటర్ బోట్ల శ్యామల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో –బాల్య వివాహ రహిత తెలంగాణ మహిళా థీమ్ తో కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ బోట్ల శ్యామల కిరణ్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్ల కలిగే ఆడపిల్లలకు కలిగే నష్టల గురుంచి తెలియజేసారు. ఇప్పుడు ఉన్న యువత సినిమాలు లో చూపించినదే ప్రేమ అనుకుని తల్లిదండ్రులను ఎదురించడం. ప్రేమ వివాహానికి ఒప్పుకోక పోతే లేచి పోయి పెళ్లి చేసుకొని ఎందరో అమ్మాయిలు వాళ్ళ జీవితాలను నాశనం చేసుకున్నారాని అన్నారు. యువత ఒక మంచి లక్ష్యాన్ని ఏర్పాచుకొని వాటి సాధన కై కృషి చేయాలి అని అన్నారు. సీడీపీవో సబిత మాట్లాడుతూ 1098 టోల్ ఫ్రీ నెంబర్ గురుంచి చెప్పారు. బాల్య వివాహల కంప్లైంట్స్ 1098 కి కాల్ చేసి నేరుగా చెప్పా వచ్చు అన్నారు.మహిళలు తమ ఆరోగ్య పట్ల శ్రద్ధ చూపాలి మహిళలు ఆరోగ్యాంగా ఉంటే నే కుటుంబం ఆరోగ్యాంగా ఉంటుంది అని తద్వారా ఆరోగ్య సమాజం నిర్మించ బడుతుందని అన్నారు. ఖఊఅ లాలో మహిళలు హెల్త్ పరీక్షలు చె?యువకోవాలి అని అన్నారు.ఈ కార్యక్రమం లో 27డివిజన్ కార్పొరేటర్ బోట్ల శ్యామల కిరణ్ కుమార్ , తిఇటబ బబీజూవతీలతిబనీతీ బ రేణుక . వార్డ్ ఆఫీసర్ బిష్త్రతితీబీఎజీశ్రీ , అూ సునీత , అంగన్వాడీ టీచర్స్ ఖీఖూ, మహిళలు పెద్ద సంఖ్య లో హాజరు అయినారు

### కాంగ్రెస్ పార్టీపై బీసీ నేత

## జాజుల శ్రీనివాస్ గౌడ్ ఫైర్

**హైదరాబాద్** కర్ణాటక సీఎం సిద్ధి రామయ్యను సీఎం పీఠం నుండి తొలగిస్తూ కాంగ్రెస్ బీసీలకు ద్రోహం చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన కర్ణాటక సీఎం సిద్ధి రామయ్యను తొలగించడం అన్యాయం . బీసీలు పాలకులుగా ఉండటం కాంగ్రెస్ కు ఇష్టం లేదు. రాహుల్ గాంధీ మాటలకు, ఆచరణకు ఎక్కడ పొంతన లేదని అన్నారు.రాహుల్ గాంధీ నోట పేరుకే కులగణన, ఎవరి వాటా వారి కే అన్నమాట అన్నది నీటి మూట లాంటిది. దేశంలోని 29 రాష్ట్రాల్లో కాంగ్రెస్ సీఎంలు నాలుగు రాష్ట్రాలు మాత్రమే. అందులో సిద్ధిరామయ్య తప్ప మూడు రాష్ట్రాల సీఎంలు అగ్రవర్ణాలే . నేడు కర్ణాటక సీఎం సిద్దరామయ్యను తొలగించడంతో ఇక నాలుగు రాష్ట్రాలు అగ్రకుల సీఎంలే . తెలంగాణ, కేరళ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంతో పాటు ఇక కర్ణాటక రాష్ట్రం కూడా కాంగ్రెస్ అగ్రకులలాకే సీఎం పీఠనీ కట్టబెడుతుంది. బిసి గొర్రె కాపరుల కుటుంబం నుండి వచ్చిన సిద్ధరామయ్యను తొలగించి బడా వ్యాపార వేత్త, అగ్రకులానికి చెందిన డీకే శివకుమార్ నియమించి కాంగ్రెస్ పార్టీ దేశంలో సామాజిక న్యాయాన్ని బొంద పెట్టింది . నాటి నెహ్రూ కాంగ్రెస్ నుండి నేటి రాహుల్ కాంగ్రెస్ వరకు బీసీలకు అన్యాయమే జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ పుట్టుక నుండి నేటి వరకు పార్టీ జాతీయ అధ్యక్షుడుగాని, ప్రధానమంత్రిగా గాని, బీసీలకు అవకాశం కల్పించలే. కర్ణాటక సిద్ధిరామయ్య తొలగించడంతోనే దేశంలో కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభమవుతుందని అన్నారు.

## మహబూబ్నగర్లో దొంగల ఘాతుకం..

**– ఏకంగా ఎస్బీఐ ఏటీఎం మిషన్నే ఎత్తుకెళ్లిన వైనం!**

మహబూబ్నగర్ తెలంగాణ చౌరస్తా సమీపంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఎస్బీఐ (ూఃఎ) ఏటీఎం సెంటర్లోకి చొరబడి, ఏకంగా ఏటీఎం మిషన్నే ఒక వాహనంలో వేసుకుని గుట్టుచప్పుడు కాకుండా పారిపోయారు.పక్కా ప్లాన్తో వచ్చిన దుండగులు.. లోపలికి వెళ్లగానే పవర్ సప్లై కట్ చేసి, సీసీటీవీ (అఋఎ) కెమెరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆపై బోయపల్లి సమీపంలోని పొలాల్లోకి మిషన్ను తీసుకెళ్లి, గ్యాస్ కట్టర్తో కట్ చేసి అందులోని నగదును ఊడ్చేశారు.ఖాళీ ఏటీఎం బాక్స్ను పొలాల్లోనే వదిలేసి పరారవ్వగా.. అసలు ఎంత మొత్తంలో నగదు చోరీకి గురైందనేది బ్యాంకు లావాదేవీలను పరిశీలించిన తర్వాతే చెప్తామని పోలీసులు వెల్లడించారు. క్లూస్ టీమ్తో దర్యాప్తు ముమ్మరం చేశారు

### రంపచోడవరం మండలం ఎర్రం పాలెం గ్రామంలో

## నాణ్యత లేకుండా సిసి రోడ్

**పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీర్ కు ఫిర్యాదు ఇచ్చిన ఫలితం శూన్యం**



**రంపచోడవరం** ఎర్రంపాలెం గ్రామంలో రూ.3 లక్షల సీసీ రోడ్డు నాసిరకం.. వేసిన నెలకే గోతులమయం నాణ్యత పాటించలేదని గ్రామస్తుల ఆరోపణ.. రంపచోడవరం మండలం.రంపచోడవరం మండలం ఎర్రంపాలెం రామాలయానికి వెళ్లే రహదారి గ్రామంలో రూ.3 లక్షల వ్యయంతో ఇటీవల వేసిన సీసీ రోడ్డు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో నెల రోజులు తిరగకముందే గోతులుగా మారింది. సిమెంట్ కాంక్రీట్ ఊడిపోయి కంకర తేలుతుండటంతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రం పాలెం గ్రామంలో ప్రధాన వీధిలో గ్రామ పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో సీసీ రోడ్డును గత నెలలో నిర్మించారు. అయితే కాంట్రాక్టర్ నిబంధనల ప్రకారం పనులు చేయకపోవడంతో రోడ్డు వేసిన కొద్ది రోజులకే పగుళ్లు తేలి, గుంతలు పడ్డాయి. వర్షానికి కాంక్రీట్ కొట్టుకుపోయి ఇనుప చువ్వలు కూడా బయటపడుతున్నాయని స్థానికులు తెలిపారు. "సిమెంట్, ఇసుక, కంకర నిష్పత్తి సరిగ్గా పాటించలేదు. క్యూరింగ్ కూడా చేయకుండా మామూలుగా వదిలేశారు. రోడ్డు మందం కూడా తక్కువగా వేశారు. చేతితో గోకితేనే కాంక్రీట్ ఊడి వస్తోంది. రూ.3 లక్షల ప్రజాధనం వృధా అయింది" అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం రోడ్డు వల్ల వృద్ధులు, చిన్నపిల్లలు నడవడానికి కూడా భయపడుతున్నారని వాపోయారు.

### పిడుగురాళ్ల మహానాడులో

## ఎన్టీఆర్ కు ఘన నివాళులు



**పిడుగురాళ్ల** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 103 వ జయంతి (2026) మహానాడు రెండవ రోజు సందర్భంగా పిడుగురాళ్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం (09 వ క్లస్టర్ ) నందు స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, యువనాయకులు యరపతినేని నిఖిల్ పూలమాలలు వేసి "పేదల పెన్నిధి, సంక్షేమ సారథి అయిన మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా పిడుగురాళ్ల పట్టణంలోని ఐలాండ్ సెంటర్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా పిడుగురాళ్ల ఐలాండ్ సెంటర్లో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వర్గీయ అన్న నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో ప్రతిష్టాత్మకంగా రెండు రోజులపాటు నిర్వహిస్తున్న రెండో రోజు మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### కేఎన్ఆర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో

## స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి వేడుకలు




**పిడుగురాళ్ల** :రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, కెఎన్ఆర్ విద్యా సంస్థలు ఆధ్వర్యంలో జరిగిన స్వర్గీయ ఎన్టీ రామారావు జన్మదినోత్సవ వేడుకల నందు డైరెక్టర్స్ కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్ రావు పాల్గొన్నారు. కేక్ కటింగ్ అనంతరం వారు మాట్లాడుతూ, తెలుగు తెర వెలుగు, నాయకుడిగా, తెలుగు ప్రజ మీద తనదైన ముద్రవేసిన మహోన్నత మనీషి నందమూరి తారక రామారావు అని అన్నారు. సినిమాలకు, రాజకీయాలకు అతీతమైన విలక్షణమైన వ్యక్తిత్వం, దేశభక్తితో పాటు తెలుగు భాష పట్ల అవ్యాజమైన ప్రేమ కలిగిన వ్యక్తి, తెలుగు వాడినంటూ గర్వంగా చెప్పుకున్న తెలుగు రేడు ఆయన ఎన్టీఆర్ వ్యక్తిత్వం చిరస్మరణీయమైనది అన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమైనది అన్నారు. జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం కొండమోడు లోని దీనమ్మ అండ్ రూరల్ డెవలప్మెంట్ అనాథ పిల్లల వృద్ధుల అనాథాశ్రమం నందు డిగ్రీ కళాశాల డైరెక్టర్ కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్ రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత బుక్స్ మరియు కేక్ కటింగ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల అధ్యాపకులు సాధినేని నరసింహారావు, తెలగపల్లి గోపికృష్ణ, ఆలూరి ప్రసన్నకుమార్, కోనేటి ప్రసన్న తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆశ్రమ చైర్మన్ గరికపాటి శంకర్రావు పాల్గొన్నారు

## జగన్ మోహన్ రెడ్డిది క్రిమినల్ మైండ్

తెలుగుదేశం పార్టీ గత 44 సంవత్సరాలుగా ప్రజల సంక్షేమం, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలే ధ్యేయంగా ప్రతి ఏటా 'మహానాడు' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కోల్లు రవీంద్ర తెలిపారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకుని ఈ వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిది ఒక 'క్రిమినల్ మైండ్' అని, రాష్ట్రం అభివృద్ధి చెందడం ఆయనకు ఎంతమాత్రం ఇష్టం లేదని విమర్శించారు."జగన్ మోహన్ రెడ్డి పాలన ప్రజావేదిక కూల్చివేతతోనే ప్రారంభమైంది. ఆఖరికి మా పార్టీ కార్యాలయాలపై కూడా దాడులు చేయించారు. దీన్ని బట్టే ఆయన ఎలాంటి వినాశకర మనస్తత్వం కలిగినవారో అర్థం చేసుకోవచ్చు" అని రవీంద్ర మండిపడ్డారు. జగన్ మోహన్ రెడ్డి యొక్క ఈ విధ్వంసకర మనస్తత్వాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా మరోసారి గమనించాలని, రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలవాలని మంత్రి కోల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

### ఏపీలో సీఎం చంద్రబాబు నాయకత్వంలో

## సుపరిపాలన

- భవిష్యత్తులో పుట్టపర్తి నియోజవర్గ అభివృద్ధిలో గేమ్ చెంజర్ గా మారడం ఖాయం.
- పరిశ్రమలు ఏర్పాటు తో పుట్టపర్తి నియోజకవర్గంలో కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి సాధ్యం
- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.
- పుట్టపర్తిలో అంగరంగ వైభవంగా రెండవ రోజు కొనసాగిన డిజిటల్ మహానాడు
- కొత్తచెరువు లో ఎన్టీఆర్ విగ్రహానికి పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే ఘన నివాళులు



**పుట్టపర్తి:28** పుట్టపర్తి నియోజకవర్గంలో రెండవ రోజు 11 క్లస్టర్లలో ఏర్పాటుచేసిన డిజిటల్ మహానాడు అంగరంగ వైభవంగా ఘనంగా సాగింది. ఎన్టీఆర్ 13 వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు కొత్తచెరువులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహనీయుడు జయంతి సందర్భంగా తెదేపా శ్రేణులతో కలసి నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్టీఆర్ విగ్రహాలకు చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు టీడీపీ శ్రేణులు ఆధ్వర్యంలో పలువురికి స్వీట్లు ,కేకులు ,బ్రెడ్లు, పండ్లు పంచిపెట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, పేదల అభ్యున్నతికి మార్గదర్శకులుగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తి నందమూరి తారక రామారావు అని కొనియాడారు. టిడిపి ఒక ప్రాంతీయ పార్టీ ఏర్పాటు చేస్తే నేడు జాతీయ స్థాయిలో తెలుగుదేశం పార్టీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం లో సంక్షేమం ,అభివృద్ధి కొనసాగుతూ సుపరిపాలన అమలు చేస్తున్న సీఎం చంద్రబాబు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం లో పేదలకు రెట్టింపు పింఛన్లు పంపిణీ,చదువుకునే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు తల్లి ఖాతాలో ,రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాలో రూ.20వేలు, మహిళలకు ,దివ్యాంగులకు ఆర్టిసి బస్సుల్లో ఉచితం ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తోందని తెలిపారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తోందని తెలిపారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు కే దక్కుతుందని అన్నారు. పుట్టపర్తి నియోజవర్గం లో 193 చెరువులను,2 రిజర్వాయర్లను కృష్ణా జలాలతో నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. నియోజవర్గం లో అనేక భారీ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని అందుకు పుట్టపర్తి లో లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ సంస్థ ఏర్పాటు కావడం ఎంతో గర్వకారణం అన్నారు. అదే విధంగా ఆమడ గూరు లో రూ. 51,400 కోట్లతో సుమారు 33వేల ఎకరాల్లో రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటు కానుందని తెలిపారు. దీంతో నియోజవర్గంలో సుమారు 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో పుట్టపర్తి నియోజకవర్గం పరిశ్రమల హబ్ గా ఐటి హబ్ గా మారడం ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం వ్యాప్తంగా 11 క్లస్టర్లలో ఏర్పాటుచేసిన డిజిటల్ మహానాడు పండుగకు వేలాదిమంది టిడిపి శ్రేణులు టిడిపి నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# జుగుప్సాకరమైన పదజాలంతో కూడిన సినీగీతాలు, సన్నివేశాలు సమాజానికి ఎంతో ప్రమాదం

- సినిమాలు, సీరియల్స్ లో స్త్రీల హక్కులకు భంగం కలిగించే రీతిలో అసభ్యకర పదజాలంతో పాటలు, డైలాగులు.
- మనస్సుకు హత్తుకునే విధంగా వినోదం పంచే సినిమాలు రావాలి.
- మహిళలను కించపరిచే సన్నివేశాలు, పాటలపై నిషేధం విధించాలి.
- పాటలు, డైలాగులు రాసే ముందు రచయితలు తమ అమ్మ, అక్క, చెల్లి, భార్యలను గుర్తుచేసుకోవాలి.
- జుగుప్సాకరమైన సన్నివేశాలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమైన సెన్సార్ బోర్డు.
- సినిమాలు, సీరియల్స్ పాటలు, డైలాగులు, సన్నివేశాలతో మహిళా హక్కులకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

బడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్) బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఇషాన్ సక్సేనా నిర్మించిన పెద్ది చలనచిత్రంలో సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ రాసిన "హెల్లల్లల్లో" అనే పాట జుగుప్సాకరమైన పదాలతో వ్యభిచార భావజాలాన్ని ప్రోత్సహించే విధంగా ఉందని ఆరోపిస్తూ రాష్ట్రీయ వానరసేన తరపున యెడ్ల కేశవరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ అధికారులకు ఫిర్యాదు చేసారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు పెద్ది చలనచిత్రంలోని హెల్లల్లల్లో అనే పాట రచనలో ఉపయెగించిన జుగుప్సాకరమైన పదజాలం మహిళలను అవమానించడమే కాక వారి హక్కులకు భంగం కలిగించేలా ఉందన్నారు. గేయ రచయిత స్త్రీ లను ఒక అంగడి వస్తువులుగా వ్యాపార ధోరణిలో చూపించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. "వారానికి వెయ్యి... నాకోసం దాయి...నెలకోసారైనా నీకిత్తా ఈ హాయి..."అరకాసులు తియ్యి... అరవంకీలేయి..."స్వర్గానికి దారి చూపిత్తాం వచ్చేయి..."అందం బిందులున్నాయ్ దా దా దా..."ఇంట్లో వంటే తింటుంటావా..."హోటల్కో దాబాకో ఓసారెల్లిముద్ద మింగి రావా..."హే ఇంట్లో తానం సాలంటావా..."పండక్కో పబ్బంకో ఏట్లోకెళ్లో మునక మనిగి రావా..."ఇది కూడా అంతేరో... ప్రతివారం సంతేరో..."అది కూడా వగ్గేత్తే పుట్టిందింకెందుకురో..."

ఈ పదజాలం మొత్తం డబ్బు, శారీరక సుఖం మార్పిడి, తాత్కాలిక సంబంధాలు, లైంగిక సంకేతాలు, మహిళలను సంతలో దొరికే సరుకు వ్యాపార సరుకుగా చూపించే భావజాలంపై ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఇటువంటి పాటలు యువతను వక్రమార్గంలో వెళ్ళేలా ప్రభావితం చేయడమే కాక మహిళల పట్ల అవమానకర దృక్పథాన్ని ప్రోత్సహించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల హైదరాబాద్లో జరిగిన సంఘటనను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి అర్ధరాత్రి సమయంలో సాధారణ మహిళలా మారువేషంలో దిల్సుఖ్నగర్ బస్ స్టాప్ వద్ద నిర్వహించిన అండర్కవర్ ఆపరేషన్ లో మహిళలపై వీధి వేధింపులు ఎంత తీవ్రమైన స్థాయిలో ఉన్నాయో బయటపడిందని




తెలిపారు. కేవలం మూడు గంటల వ్యవధిలో దాదాపు 40 మంది వ్యక్తులు అసభ్య వ్యాఖ్యలు, లైంగిక వేధింపులతో కూడిన ప్రశ్నలు, అనుచిత ప్రవర్తన ప్రదర్శించినట్లు వెలుగులోకి రావడంతో సమాజంలో మహిళల పట్ల పెరుగుతున్న అవమానకరమైన ధోరణికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సినిమాలు, పాటలు, వినోద మాధ్యమాల్లో మహిళలను వస్తువులుగా చూపించే అసభ్య పదజాలం మరింత ప్రమాదకర సామాజిక ప్రభావాన్ని కలిగిస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఛ) కింద భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉన్నప్పటికీ, ఆర్టికల్ 19(2) ప్రకారం శీలం నైతిక పరిమితులు వర్తిస్తాయని గుర్తుచేశారు.

అలాగే భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), 2023 లోని

- సెక్షన్ 294-- అసభ్యకర చర్యలు, పాటలు లేదా పదజాలం ద్వారా ప్రజా అసౌకర్యం అసభ్యతకు సంబంధించిన నేరాలు
- సెక్షన్ 79-- మహిళ గౌరవాన్ని అవమానించే ఉద్దేశ్యంతో చేసిన మాటలు, సంకేతాలు లేదా చర్యలు




- సినిమాటోగ్రాఫ్ చట్టం మార్గదర్శకాలు-- ప్రజా శీలం, నైతికత మహిళల గౌరవాన్ని కాపాడే సెన్సార్ ప్రమాణాలు
- మహిళల అసభ్య ప్రతినిధిత్వ (నిషేధ) చట్టం, 1986-- మహిళలను అసభ్యంగా, లైంగిక వస్తువులుగా లేదా అవమానకరంగా చిత్రీకరించడాన్ని నిషేధించే చట్టాల కింద ఈ

ఈ అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఈ సందర్భంగా సంబంధిత పాటను తక్షణం సమీక్షించి అభ్యంతరకర పదాలను తొలగించి సవరణలు చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడమే కాక భవిష్యత్తులో ఇలాంటి అసభ్యకరమైన పదజాలంతో కూడిన సినీ గీతాలపై కఠినమైన చర్యలు చేపట్టాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. అలాగే, ప్రజా సమస్యకు సంబంధించిన అంశంగా భావించి ఎటువంటి సంకోచం లేకుండా వెంటనే తమ పిర్యాదును స్వీకరించిన తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్, సిబిఎఫ్సి హైదరాబాద్ అధికారులకు కేశవర్ధన్ రెడ్డి యెడ్ల కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ఆందోళనలను గౌరవిస్తు తక్షణ స్పందన చూపడం బాధ్యతాయుత ప్రజాస్వామ్య వ్యవస్థకు నిదర్శనం అని పేర్కొన్నారు. సమాజంలో మహిళల గౌరవం, సాంస్కృతిక విలువలతో కూడిన బాధ్యతాయుతమైన వినోదాన్ని పరిరక్షించే ఉద్దేశ్యంతో ప్రజాహిత ప్రయోజనాల దృష్ట్యా ఈ పిర్యాదును చేసినట్లు కేశవర్ధన్ రెడ్డి యెడ్ల తెలిపారు.

# సంపాదకీయం

## ఒకవైపు శాంతి మంత్రం.. మరోవైపు యుద్ధ తంత్రం..!

పశ్చిమాసియాలో త్వరలోనే శాంతి నెలకొంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచానికి శుభవార్త చెప్పారు. ఇరాన్ కూడా యురేనియం వదులుకునేందుకు సిద్ధమైంది. ఈ తరుణంలో ఇక అంతా మంచే జరుగుతుందని భావిస్తున్న వేళ అమెరికా ఆత్మరక్షణ పేరుతో ఇరాన్పై భీకర దాడులు మొదలు పెట్టింది. మరోమారు తన సైనిక బలాన్ని ప్రదర్శించింది. ఇరాన్ దక్షిణ తీర ప్రాంతాల్లోని బందర్ అబ్బాస్, క్వెష్మ్ పోర్టు సమీపంలోని సైనిక స్థావరాలు, క్షిపణి లాంచ్ ప్యాడ్లు, సముద్రంలో మైన్లు (మందుపాతరలు) పరచే బోట్లు, నేవీ బేస్లపై తీవ్ర దాడులు జరిపింది. అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమోతీ హాకిన్స్ ఈ దాడులను "ఆత్మరక్షణ చర్య"గా సమర్థించారు. ఇరాన్ తీరం వెంట ఉన్న క్షిపణి స్థావరాలు తమ విమాన వాహక నౌకలు, యుద్ధ నౌకలకు నేరుగా ముప్పు కలిగించాయని, మందుపాతరలు పరచడానికి ప్రయత్నించే బోట్లను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. లర్క్ ద్వీపంలో కనీసం నలుగురు మరణించినట్లు సమాచారం. ఈ దాడుల్లో ఇజ్రాయెల్ కూడా పాల్గొన్నట్లు కొన్ని వార్తా వర్గాలు పేర్కొన్నాయి.ప్రపంచ ఇంధన మార్గాల్లో ఆక్సిజన్గా భావించే హార్ముజ్ జలసంధి దాదాపు మూడు నెలలుగా స్తబ్దంగా మారింది. అమెరికా?ఇజ్రాయెల్ కూటమి, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఈ కీలకమైన నౌకా మార్గాన్ని అడ్డుకోవడంతో, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన హెచ్చరిక సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితి 1967 సూయజ్ కాలువ సంక్షోభాన్ని గుర్తు చేస్తోంది.1967 అరబ్?ఇజ్రాయెల్ యుద్ధంలో సూయజ్ కాలువలో 15 నౌకలు చిక్కుకుపోయి, ఎనిమిదేళ్లపాటు అక్కడే కూరుకుపోయాయి. 'ఎల్లో ఫ్లీట్'గా ప్రసిద్ధి చెందిన ఆ నౌకలు తుప్పు పట్టి, చరిత్రలో ఒక హెచ్చరికగా మిగిలిపోయాయి. ఇప్పుడు హార్ముజ్లోనూ అదే దృశ్యం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్ని రోజులు ఈ దిగ్బంధనం కొనసాగుతుందో, ఎన్ని ఓడలు ఈ జలసంధిలో నిలిచిపోతాయో ప్రస్తుతం ఎవరూ ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. ఈ సంక్షోభం సైన్స్ ఫిక్షన్ లాగా అనిపించినా, వాస్తవం మాత్రం తీవ్రంగా ఉంది.సంక్షోభం ప్రారంభం నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ స్పష్టమైన దూరదృష్టితో ముందుకు వెళ్తోంది. హార్ముజ్పై ఆధారపడకుండా చమురు రవాణా చేసేందుకు ప్రత్యామ్నాయ పైప్లైన్ల నిర్మాణాన్ని వేగవంతం చేసింది. 2027 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి కావొచ్చని అంచనాలు ఉన్నాయి. దౌత్య చర్చలు జరుగుతున్నా, దీర్ఘకాలిక ఉద్రిక్తతలు కొనసాగే అవకాశం ఉందని అబుదాబి అంచనా వేస్తోంది. ఇది ఒక దేశం మాత్రమే కాదు, మొత్తం గల్ఫ్ ప్రాంతం యొక్క భద్రతా వ్యూహంలో భాగం.సంక్షోభం త్వరలో ముగిసి, చమురు ధరలు అనియంత్రితంగా పెరగకుండా సమతుల్యత నిలుస్తుందని వారు నమ్ముతున్నారు. అయితే ఈ ఆశలు ఎంతవరకు వాస్తవ రూపం దాల్చేయనేది ప్రశ్నార్థకం. ప్రపంచవ్యాప్తంగా రోజుకు సుమారు 20 మిలియన్ బ్యారెల్స్ చమురు సరఫరా అంతరాయం కలిగింది. సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలు, అత్యవసర నిల్వలు విడుదల చేయడం ద్వారా తాత్కాలికంగా పరిస్థితిని నియంత్రించగలిగాయి. కానీ ఈ నిల్వలు ఎప్పటికప్పుడు అయిపోతాయి.ఇరాన్ సంకల్పం. ఆర్థిక ఒత్తిడిఇరాన్ వైపు చూస్తే, తీవ్రమైన ఆర్థిక సవాళ్ల మధ్య కూడా వెనక్కి తగ్గే సంకేతాలు కనిపించడం లేదు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, కరెన్సీ విలువ క్షీణత వంటి సమస్యలు ఉన్నప్పటికీ, ఉనికి కోసం పోరాటం కొనసాగుతోంది. రెండు వైపులా 'ముందుగా ఎవరు ఒప్పుకుంటారు' అని వేచి చూడడం జరుగుతోంది. ఇలాంటి స్థిరత్వం లేని ఎదురు చూపు ప్రపంచానికి మరింత నష్టం కలిగిస్తుంది. హార్ముజ్ను శాశ్వతంగా మూసివేయడం ఎవరికీ లాభదాయకం కాదు. త్వరిత తాత్కాలిక ఒప్పందం అవసరం. అయితే గత చరిత్ర చెప్పినట్లు, ఒక్కసారి సాధారణమైన సంక్షోభాలు కాలక్రమేణా దీర్ఘకాలిక సమస్యలుగా మారే ప్రమాదం ఉంది. ప్రపంచ ఇంధన భద్రత ఇకపై భౌగోళిక రాజకీయాలపై ఆధారపడి ఉండదు. వైవిధ్యపరమైన సరఫరా మార్గాలు, పునరుత్పాదక ఇంధనాల వైపు వేగవంతమైన మార్పు, ప్రాంతీయ దేశాల మధ్య సహకారం ? ఇవి భవిష్యత్ కోసం అనివార్యమైన అడుగులు.చరిత్ర నుంచి నేర్చుకోకపోతే, ఆర్థిక వ్యవస్థలు మాత్రమే కాదు, సమగ్ర ప్రపంచ స్థిరత్వం కూడా ప్రమాదంలో పడుతుంది. సమయం ఇంకా ఉంది, కానీ చాలా తక్కువగా ఉంది.ఏప్రిల్ 7న ప్రకటించిన సీజ్ఫైర్ అమలులో ఉన్నప్పటికీ ఇరాన్ తన సైనిక సామర్థ్యాన్ని వేగంగా పునరుద్ధరిస్తోందని అమెరికా ఇంటెలిజెన్స్ గుర్తించింది. ఇది ఇరాన్కు స్పష్టమైన హెచ్చరిక. దోహాలో జరుగుతున్న కీలక దౌత్య ప్రయత్నాలుదాడులు జరుగుతున్న అదే సమయంలో ఖతార్ రాజధాని దోహాలో ఇరాన్?అమెరికా దూతల మధ్య కీలక చర్చలు సాగుతున్నాయి. ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ నేతృత్వంలోని బృందం ఈ సంప్రదింపుల్లో పాల్గొంటోంది. ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ అనేక అంశాలపై అవగాహన కుదిరినట్లు, అయితే ఇంకా కొన్ని కీలక సమస్యలు మిగిలి ఉన్నాయని తెలిపారు.ఇరాన్ ప్రధాన దృష్టి యుద్ధ ముగింపు (లెబనాన్తో సహా) వైపే ఉందని, ప్రస్తుతం అణు అంశాలను చర్చించడం లేదని స్పష్టం చేశారు.యుద్ధం పూర్తిగా ముగిస్తే 60 రోజుల వ్యవధిలో అణు సంబంధిత చర్చలు ప్రారంభించవచ్చని సంకేతాలిచ్చారు.

ఖతార్ మధ్యవర్తిత్వం ఈ చర్చలకు కీలకమవుతోంది. లెబనాన్పైనా దాడులు జరగకుండా ఒప్పందం చేసుకునే అవకాశం ఉంది.ఈ తరుణంలో అమెరికా 33 మిసైల్ సైట్లలో దాదాపు 30ను తిరిగి కార్యకలాపాలు ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 70 శాతం మొబైల్ మిసైల్ లాంచర్లను మోహరించింది. ఇది ఇరాన్ ఎదురుదాడి సామర్థ్యాన్ని ఇప్పటికీ కాపాడుకోవాలన్న సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది. మరోవైపు అమెరికా దాడులు ఇరాన్ను మరింత ఒత్తిడికి గురి చేసి చర్చల టేబుల్ వద్ద రాజీకి సిద్ధం చేయడానికి ఉద్దేశించినట్లు కనిపిస్తోంది. ఈ ద్వంద్వ వ్యూహం (దాడి + దౌత్యం) మధ్యప్రాచ్య రాజకీయాల సారాంశాన్ని బయటపెడుతోంది. స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ భద్రత, ఇరాన్ అణు కార్యక్రమ నియంత్రణ, ప్రాంతీయ స్థిరత్వం ? ఇవన్నీ అమెరికా స్ట్రాటజిక్ లక్ష్యాలు. ఇరాన్ మాత్రం ఆర్థిక ఒత్తిడి, సైనిక నష్టాల నుంచి బయటపడి తన ప్రాంతీయ ప్రభావాన్ని కాపాడుకోవాలని చూస్తోంది.

ఈ చర్చలు విజయవంతమైతే మధ్యప్రాచ్యంలో కొత్త శాంతి అధ్యాయం మొదలవుతుంది. ఇరాన్ ఆయిల్ ఎగుమతులు సాఫీగా జరగడం, ఆర్థిక ఉక్కిరిబిక్కిరి తగ్గడం, ప్రాంతీయ ఉద్రిక్తతలు తగ్గడం వంటి సానుకూల ఫలితాలు వస్తాయి. కానీ ఒప్పందం కుదరకపోతే ఉద్రిక్తతలు మరింత పెరిగి పెద్ద యుద్ధంగా మారే ప్రమాదం ఉంది. ప్రస్తుతం రెండు వైపులా "ఒప్పందం కావాలి" అన్న కోరిక కనిపిస్తోంది.

అయితే షరతులు, అణు అంశాలు, సైనిక నియంత్రణ వంటి విషయాల్లో ఇంకా తీవ్ర అసమ్మతి నెలకొని ఉంది.దోహా చర్చల ఫలితాలు రాబోయే రోజుల్లో ప్రపంచ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపించవచ్చు. మధ్యప్రాచ్య శాంతి ఎప్పుడూ సులభం కాదు. బాంబులు పడుతున్నప్పుడే దౌత్యం నడుస్తున్న ఈ ఆటలో ఏ చిన్న తప్పిదం కూడా సమస్యగా మారుతుంది. ఈ సంక్లిష్టతల మధ్య నుంచి నిజమైన శాంతి ఎలా ఉద్భవిస్తుందో చూడాలి.

## తెలంగాణకు టీడీపీ కావాలి

**విజయవాడ,** తెలంగాణకు టీడీపీ అవసరం ఉందని ఆ పార్టీ నాయకురాలు జ్యోత్స్న.. మహానాడులో పేర్కొన్నారు. తెలంగాణకు నారా లోకేష్ లాంటి యంగ్ అండ్ డైనమిక్ లీడర్ కావాలని తెలిపారు. ఏపీ విద్యా శాఖకు నారా లోకేష్ మంత్రిగా ఉన్నారని.. కానీ తెలంగాణలో విద్యా శాఖకు ప్రత్యేక మంత్రి లేరని ఆమె ఎద్దేవా చేశారు. తెలంగాణలో 22 ఏళ్లుగా టీడీపీ అధికారంలో లేకపోయినా.. తాము పార్టీని వీడకుండా జెండా పట్టుకుని నిలబడ్డామని జ్యోత్స్న వెల్లడించారు.ఎన్టీఆర్ జయంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడు సందర్భంగా టీడీపీ తెలంగాణ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న.. సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అవసరం ఉందని ఆమె తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు లాంటి నాయకుడి దిశానిర్దేశం తెలంగాణ రాష్ట్రానికి అవసరమని జ్యోత్స్న పేర్కొన్నారు. ఇక డైనమిక్ ఆలోచనలు ఉన్న నారా లోకేష్ వంటి నేత తెలంగాణకు కావాలని ఆమె కోరారు. అందుకే మళ్లీ తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని జ్యోత్స్న వెల్లడించారు.మహానాడులో భాగంగా తెలంగాణ విద్యాభివృద్ధి అనే తీర్మానం ప్రవేశపెట్టిన జ్యోత్స్న.. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలకు సామాజిక న్యాయాన్ని దివంగత నేత ఎన్టీఆర్ కల్పిస్తే.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు విస్తృత అవకాశాలు ఇచ్చారని జ్యోత్స్న గుర్తు చేశారు. భవిష్యత్ నైపుణ్యాన్ని నారా లోకేష్ ఇస్తున్నారని పేర్కొన్న జ్యోత్స్న.. దాన్ని తెలంగాణకు కూడా ఇవ్వాలని కోరుతున్నట్లు చెప్పారు. తెలంగాణలో టీచర్ పోస్టుల భర్తీని పారదర్శకంగా జాబ్ క్యాలెండర్ ప్రకారం భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.తెలుగుదేశం పార్టీ ఎన్నడూ ఓట్ల కోసం రాజకీయం చేయదని తెలిపిన జ్యోత్స్న.. గత 22 ఏళ్లుగా రాష్ట్రంలో అధికారంలో లేకపోయినప్పటికీ.. పసుపు జెండాను మాత్రం తాము అనుక్షణం గుండెల్లో పెట్టుకుని.. కష్టపడి, పోరాడి నిలబడేవాడే తెలంగాణ కార్యకర్త అని గుర్తు చేశారు. విద్య, ఉద్యోగం, అభివృద్ధి అనేవి తెలుగుదేశం పార్టీ విధానమని జ్యోత్స్న వెల్లడించారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ వేసిన పునాది వల్ల విద్యా విప్లవం రావాలని.. కానీ రాష్ట్ర విభజన తర్వాత ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ వంటి యూనివర్సిటీలు ర్యాంకింగ్లోనూ వెనుకబడ్డాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణలోని ప్రభుత్వ స్కూళ్లు పేద పిల్లలకు గర్వంగా మారాలని.. పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ భరోసాగా ఉండాలని జ్యోత్స్న పేర్కొన్నారు. చదువుకుని డిగ్రీలు ఉన్న యువతకు ఉద్యోగాలు రావాలని.. కానీ తెలంగాణలో ఇవేవీ రాలేదని చెప్పారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో మాటలు పెద్దవి.. చేతలు శూన్యమని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ పార్టీ పాలనలో విద్యా రంగంలో స్పష్టమైన టైం బౌండ్ రోడ్ మ్యాప్ కనిపించడం లేదని.. అంతేకాకుండా తెలంగాణకు ప్రత్యేకంగా విద్యాశాఖ మంత్రే లేకపోవడం మరో దౌర్భాగ్యం అని జ్యోత్స్న వివరించారు.

## మహానాడు పై వైసీపీ విమర్శ

**తిరుపతి** తెలుగుదేశం పార్టీ హైబ్రిడ్ మహానాడు అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు మాజీ మంత్రి రోజా. మహానాడు స్టేజ్ల మీద రికార్డింగ్ డాన్సులు పెట్టి ప్రజలు తీసుకొచ్చే ఎత్తుగడలు వేశారని ఆరోపించారు. టీడీపీ కార్యకర్తలు కూడా మహానాడును పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు.. ఇది మహానాడు కాదు దగా నాడని ప్రజలకు అర్థమైందన్నారు. మహానాడు వేదికపై టీడీపీ నేతల భాష, బాడీ లాంగ్వేజ్ అసహ్యంగా ఉందని.. ఇది సైకిల్ పార్టీ మహానాడా?.. సైకో పార్టీ మహానాడా? అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. వైఎస్ జగన్ కాలి గోటికి సరిపోని వారు కూడా మహానాడు పేరుతో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహానాడులో వైఎస్ జగన్ నామస్మరణ చేశారని.. ఆయన పేరు చెబితేనే టీడీపీ నేతలకు వెన్నులో వణుకు పుడుతోందన్నారు. గొడ్డలి పార్టీ వైఎస్సార్సీపీ కాదు టీడీపీనే.. వివేకా హత్యకేసు నిందితుడు దస్తగిరి, టీడీపీకి సంబంధించిన లాయర్ ఒక్కరేనని విమర్శించారు. వివేకా హత్యలో టీడీపీ హస్తముందని ఆరోపించారు.వైఎస్ జగన్ మహిళా పక్షపాతిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన చేశారని.. చంద్రబాబు మాత్రం మహిళా కక్షపాతిగా మారారంటూ రోజా మండిపడ్డారు. చంద్రబాబు మహానాడు వేదికగా రెండు నాలుకల ధోరణి ప్రదర్శించారని ధ్వజమెత్తారు. పార్లమెంట్లో మహిళా బిల్లు ప్రవేశపెట్టే రోజే టీడీపీ మహిళా నేతలంతా ఢిల్లీకి వెళ్లారని.. బిల్లు వీగిపోయిన తర్వాత సాయంత్రం పార్టీ చేసుకున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నవారిని కలిశారు కాబట్టి వాళ్లంతా మహిళా ద్రోహులన్నారు. మహిళా బిల్లు వీగిపోవడానికి కారణమైన కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పార్టీకి వారంతా హాజరయ్యారని.. కాంగ్రెస్తో టీడీపీకి హాట్లైన్ బంధముందని గతంలో జగన్ చెప్పిన మాట నిజమైందన్నారు. ఉదయం బీజేపీతో బ్రేక్ఫాస్ట్, సాయంత్రం కాంగ్రెస్తో డిన్నర్ అంటూ టీడీపీని టార్గెట్ చేశారు.కూటమిని ఎన్నికల హామీల గురించి ప్రశ్నిస్తే తల్లి, చెల్లి, గొడ్డలి పార్టీ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని రోజా మండిపడ్డారు.

చంద్రబాబు హెరిటేజ్ ఆస్తుల్లో తల్లికి, చెల్లికి ఎంత వాటా ఇచ్చారో చెప్పాలని.. ఆయన తల్లితో, చెల్లితో ఉన్న ఒక్క ఫోటో బయట పెట్టాలన్నారు. వైఎస్ జగన్ తన చెల్లికి దేశంలో ఎవరూ ఇవ్వని ఆస్తి ఇచ్చారని.. వైఎస్ వివేకా హత్య గురించి అధికారంలో ఉన్న చంద్రబాబును సునీత, షర్మిల ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు.మంత్రి లోకేష్ రైమింగ్ కోసం చౌకబారు విమర్శలు చేయడం తగ్గించుకోవాలన్నారు రోజా.

## పవన్పై కామెంట్స్.. బీజేపీ ఫైర్

**హైదరాబాద్,** ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, ప్రొఫెసర్ నాగేశ్వర్పై ఆంధ్రప్రదేశ్లో నమోదైన కేసుల విషయంలోలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్లో నిర్వహించిన సంఘీభావ సమావేశం ఇప్పుడు రెండు రాష్ట్రాల రాజకీయాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది. నాగేశ్వర్కు మద్దతు తెలపాల్సిన వేదికపై, కొందరు వక్తలు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లక్ష్యంగా వ్యక్తిగత దూషణలకు దిగడం రాజకీయ రంగు పులుముకుంది. అభిప్రాయ ప్రకటనా స్వేచ్ఛను అణచివేస్తున్నారంటూ మొదలైన ఈ చర్చ, కొద్దిసేపటికే దారి తప్పింది. వేదికపై ఉన్న కొందరు వక్తలు ఏపీ రాజకీయాల గురించి మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితం , ఆయన తీరుపై అత్యంత అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదమయింది. సంఘీభావ సభ కాస్తా పవన్ కల్యాణ్ టార్గెట్ సభగా మారిపోయిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాలపై బీజేపీ సీనియర్ నేత విష్ణువర్ధన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. పవన్ కల్యాణ్పై కొంతమంది చేసిన అనుచిత వ్యాఖ్యలు, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల మధ్య ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలను ఏపీ బీజేపీ నుండి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 12 సంవత్సరాల తర్వాత కూడా ప్రాంతీయ భేదాలు, ప్రజల సెంటిమెంట్ రెచ్చగొట్టడం దేనికి సంకేతం? ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమే కానీ వ్యక్తిగత దూషణలు, ప్రాంతీయభావోద్వేగాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలకు ఎలాంటి స్థానం లేదన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన తప్పును తానే ఒప్పుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ప్రజా వేదికలపై మాట్లాడే ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రెస్ క్లబ్ సమావేశంలో చేసిన వ్యాఖ్యల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో జనసేన శ్రేణులు భగ్గుమన్నాయి. పవన్ కల్యాణ్ను వ్యక్తిగతంగా దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పవన్ గౌరవానికి భంగం కలిగించేలా మాట్లాడిన మేధావులను బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ం

ఈ వివాదంపై మేధావి వర్గంలో కూడా చీలిక కనిపిస్తోంది. నాగేశ్వర్పై కేసులను ఖండించడంలో తప్పు లేదని, కానీ అదే సమయంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులను వ్యక్తిగతంగా దూషించడం వల్ల అసలు సమస్య పక్కదారి పడుతుందని కొందరు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ విమర్శలకు, వ్యక్తిగత దూషణలకు మధ్య ఉన్న గీతను మేధావులు గుర్తించకపోతే వారి విశ్వసనీయత దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు.

## కొలిమిగుండ్ల మండలంలో ఘనంగా ఎన్టీఆర్103వ జయంతి వేడుకలు



**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల మండలంలో రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలను టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు కలిసి ఘనంగా నిర్వహించారు. రెండు చోట్ల నిర్వహించిన క్లస్టర్లలో టిడిపి మహానాడు 2026 విజయవంతమైందని టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి, క్లస్టర్ ఇన్చార్జులు నంద్యాల రామేశ్వర్ రెడ్డి, వి ఆర్. లక్ష్మిరెడ్డి సంయుక్తంగా కలిసి గురువారం నాడు తెలియజేశారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా టిడిపి నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కొలిమిగుండ్ల రాంకో కళ్యాణమండపం నుండి బృందావన్ కళ్యాణ మండపం వరకు టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి టిడిపి నాయకులు కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహానాడు కార్యక్రమాన్ని తిలకించడానికి రెండు చోట్ల డిజిటల్ స్క్రీన్ లను ఏర్పాటు చేశారు. రెండవ రోజు మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు టిడిపి మండల అధ్యక్షుడు మూల రామేశ్వర్ రెడ్డి నాయకులు కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రెండు క్లస్టర్లలో మహానాడుకు వచ్చిన నాయకులు కార్యకర్తలకు భోజన వసతిని కల్పించారు. ఈ కార్యక్రమంలో మూలే రామేశ్వర్ రెడ్డి, నంద్యాల రామేశ్వర్ రెడ్డి, వి ఆర్. లక్ష్మిరెడ్డి, అంబటి జయలక్ష్మి రెడ్డి, ఇటిక్యాల శివారెడ్డి, ఇటిక్యాల బాలిరెడ్డి, వెంకట మల్లారెడ్డి, పులి ప్రకాశ్ రెడ్డి, మూలే హుస్సేన్ రెడ్డి, గొంగటి హుసేన్ రెడ్డి, గొంగటి నారాయణరెడ్డి, అంబటి వివేకానంద రెడ్డి, అంబటి ప్రకాశ్ రెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, మూల శివారెడ్డి, సూరి, వెంకటేశ్వర్లు, చౌడయ్య, తోట అమర్నాథరెడ్డి, తోట నాగమల్లారెడ్డి, తోట పరమేశ్వర్ రెడ్డి, బాలస్వామి రెడ్డి, బాయికాటి బ్రదర్స్, రఘురామిరెడ్డి, కళ్యాణ్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, నంద్యాల నారాయణరెడ్డి, ఈశ్వర్ రెడ్డి,పల్లె వెంకటేశ్వర రెడ్డి, వెన్నపూస రామచంద్రారెడ్డి, రవి ప్రకాశ్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, లోకేపల్లె మధు ప్రసాద్ రెడ్డి, అందే రాము, రవికుమార్, చంద్ర, మందా విజయ్, కమ్మవారిపల్లె వెంకటేశ్వరరావు, కత్తి రామదాసు, పెద్ద వెంతుర్ల చెన్నారెడ్డి, ఎర్రగుడి రాజగోపాల్, నిమ్మకాయల దస్తగిరి, నాగిశెట్టిపల్లె సురేష్ నాయుడు, వేణు యాదవ్, చిన్నపరెడ్డి, లోకనాథరెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, నరసింహారెడ్డి, భూపాల్, ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటీటీలోకి వచ్చిన ధనుష్ కొత్త సినిమా




ధనుష్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కర' ఓటీటీలోకి వచ్చేసింది. నేటి నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. 1990ల కాలం నేపథ్యంలో బ్యాంకుల అప్పులు, వాటిని తీర్చలేక ఒక వ్యక్తి నేర ప్రపంచంలోకి అడుగుపెట్టే పరిస్థితులను ఈ చిత్రంలో వాస్తవికంగా చూపించే ప్రయత్నం చేశారు.

ఈ చిత్రం 2026 ఏప్రిల్ 30న విడదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది. బాక్సాఫీస్ వద్ద సుమారు రూ.40 కోట్ల వసూళ్లు సాధించింది. ఈ చిత్రం తమిళం, తెలుగు, హిందీతో పాటు పలు భాషల్లో ఓటీటీలో అందుబాటులోకి వచ్చింది. ఈ చిత్రంలో ధనుష్ సరసన మమితా బైజు హీరోయిన్‌గా నటించారు. సీనియర్ నటుడు కేఎస్ రవికుమార్ కీలకపాత్రలో మెప్పించారు. ఈ చిత్రానికి జి.వి.ప్రకాశ్ కుమార్ సంగీతం అందించారు. తన సంగీతంతో 1990ల నాటి వాతావరణాన్ని అద్భుతంగా తెరపై కనిపించేలా చేశారు.

# సీనియర్ ఎన్టీఆర్ జయంతి .. ఘాట్ వద్ద నివాళులు అర్పించిన జూనియర్ ఎన్టీఆర్






తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, మాజీ ముఖ్యమంత్రి, నటసార్వభౌముడు నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద భావోద్వేగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ నేడు ఉదయం ఎన్టీఆర్ ఘాట్‌కు చేరుకుని తన తాతయ్య ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. తెల్లవారుజామునే ఘాట్ వద్దకు చేరుకున్న తారక్ పూలమాల వేసి, నివాళులు సమర్పించి కొద్దిసేపు అక్కడే మౌనంగా నిలబడి తాతయ్య జ్ఞాపకాలను స్మరించుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్ రాకతో ఘాట్ పరిసరాలు అభిమానులతో కిక్కిరిశాయి. తారక్‌ను చూడాలని అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి తరలివచ్చారు. "అన్నా.. అన్నా" అంటూ అభిమానులు నినాదాలు చేయడంతో ఆ ప్రాంతం మొత్తం సందడిగా మారింది. అభిమానులకు చేతులు ఊపుతూ అభివాదం చేసిన తారక్, అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆయన వెంట భద్రతా సిబ్బంది భారీగా మోహరించారు. నందమూరి కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు, సినీ ప్రముఖులు కూడా ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకుని మహానేతకు నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే మహానుభావుడని పలువురు కొనియాడారు. సినీ రంగంలోనూ, రాజకీయ రంగంలోనూ ఆయన చేసిన సేవలు మరువలేనివని గుర్తుచేశారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, ప్రతి ఏడాది ఎన్టీఆర్ జయంతి, వర్ధంతి సందర్భంగా ఘాట్ వద్దకు వచ్చి నివాళులు అర్పించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. తాతయ్యపై తనకున్న అపారమైన గౌరవాన్ని తారక్ పలుమార్లు బహిరంగంగా వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అభిమానులు సేవా కార్యక్రమాలు, అన్నదానాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ మహానేతను స్మరించుకుంటున్నారు. సోషల్ మీడియాలో కూడా ఎన్టీఆర్‌కు సంబంధించిన అరుదైన ఫొటోలు, వీడియోలు వైరల్ అవుతూ అభిమానుల్లో భావోద్వేగాన్ని కలిగిస్తున్నాయి.

# భాగ్యశ్రీ బోర్సే గురించి అలాగే అనుకుంటున్నారు మరి!

భాగ్యశ్రీ బోర్సే .. పాల సరస్సులో పూసిన తెల్లకలువలాంటి అందం. అమరశిల్పి జక్కన ఊహకి కూడా అందని శిల్పం. మబ్బులను .. మెరుపులను కలిపి చేసినట్టుగా కనిపించే రూపం. చోళులు .. చాళుక్యుల కాలం నాటి శిల్పాల వరుసలో తప్ప, ఈ మధ్య కాలంలో ఎవరూ ఎక్కడా చూడని ఒక లావణ్య విశేషం. విశాలమైన కళ్లతో విన్యాసాలు చేస్తూ ఆమె యూత్ హృదయాలను కొల్లగొట్టేస్తోంది. అలాంటి భాగ్యశ్రీ బోర్సే గురించి మాట్లాడుకోని కుర్రాళ్లు ఉండరనే చెప్పాలి. తెరపై భాగ్యశ్రీని చూసిన కుర్రాళ్లంతా ఈ అమ్మాయికి నటన తెలియక పోయినా ఫరవాలేదు. అలా తెరపై కనిపిస్తూ ఉంటే చాలానే అనుకుంటారు. అందువల్లనే పెద్దగా సక్సెస్ లు లేకపోయినా, అవకాశాలు మాత్రం వెతుక్కుంటూనే వస్తున్నాయి. వచ్చే నెల చివరి వారంలో ఈ సుందరి 'లెనిన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ జోడీగా ఆమె చేసిన ఈ సినిమా, భారీ విజయాన్ని అందుకోవడం ఖాయమనే ఒక టాక్ బలంగానే వినిపిస్తోంది. అయితే ఇక్కడ మరో విశేషం ఏమిటంటే, 'పెద్ది' సినిమాలో భాగ్యశ్రీ కూడా మెరిసి ఉంటే బాగుండేదనే ఒక టాక్ ఇప్పుడు షికారు చేస్తోంది. 'పెద్ది'లో జాన్వీకపూర్ కథానాయికగా నటించగా, ఐటమ్ సాంగ్ లో శృతిహాసన్ సందడి చేయనుంది. మార్కెటింగ్ పరంగా చూసుకుంటే, మేకర్స్ నిర్ణయం సరైనదే అయినా, గ్లామర్ పరంగా చూసుకుంటే, భాగ్యశ్రీ కూడా ఎక్కడో ఒక చోట మెరిసే ఛాన్స్ ఇచ్చి ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చరణ్ తరువాత సినిమాలోనైనా ఈ బ్యూటీకి ఛాన్స్ దొరుకుతుందేమో చూడాలి మరి.



# 'డెర్బీ' మూవీ రివ్యూ!




కాలేజ్ నేపథ్యంలోని కథలు యూత్ ను విశేషంగా ఆకట్టుకుంటూ ఉంటాయి. క్యాంపస్ కథలతో వచ్చిన చాలా సినిమాలు విజయాలను సాధించాయి. అలాంటి ఒక నేపథ్యంలో వచ్చిన సినిమానే 'డెర్బీ'. మార్చి 27వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఇప్పుడు ఓటీటీలోకి అడుగుపెట్టింది. ఈ నెల 15వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్' లో స్ట్రీమింగ్ అవుతోంది. మలయాళంతో పాటు తెలుగులోను ఈ సినిమా అందుబాటులోకి వచ్చింది. అర్జున్ .. సందీప్ .. ష్వాన్ .. ఉస్తాద్ .. యూసఫ్ .. మరియా స్నేహితులుగా ఉంటారు. అందరూ కూడా ఒకే కాలేజ్ లో చేరతారు. అర్జున్ తల్లి విదేశాలలో ఉంటుంది. అందువలన అర్జున్ కి సంబంధించిన అన్ని విషయాలను తండ్రి దినకరన్ చూసుకుంటూ ఉంటాడు. ఇక యూసఫ్ విషయానికి వస్తే, తండ్రి లేని యూసఫ్ ను ఫారిన్ లో ఉంటున్న మేనమామ దగ్గరికి పంపించాలనే ఉద్దేశంతో తల్లి ఉంటుంది. ఇక మిగతా స్నేహితులంతా కూడా మధ్యతరగతి నుంచి వచ్చినవారే. కాలేజ్ లైఫ్ ను కలర్ఫుల్ గా గడపొచ్చు .. ఎంజాయ్ చేయవచ్చని భావించిన అర్జున్ టీమ్ కి, తొలిరోజునే నిరాశ ఎదురవుతుంది. కాలేజ్ లో థర్డ్ ఇయర్ గ్యాంగ్ కి లీడర్ గా 'రియాజ్' ఉంటాడు. సెకండియర్ గ్యాంగ్ కి 'అమల్' నాయకుడిగా ఉంటాడు. ఈ రెండు గ్రూపుల మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉంటాయి. ఫ్రెషర్స్ గా వచ్చిన అర్జున్ బ్యాచ్ వాళ్లు సీనియర్స్ ను చూసి కంగారు పడిపోతారు. కాలేజ్ లో తాము అనుకున్నట్టుగా రోజులు గడవడం కష్టమేనని వాళ్లకి అర్థమైపోతుంది. ఫస్ట్ ఇయర్ వాళ్లను సీనియర్స్ ప్రతి విషయంలో ఎవైడ్ చేస్తుంటారు. క్లాస్ రూమ్స్ .. క్యాంపస్ .. క్యాంటీన్ .. ప్లే గ్రౌండ్ .. ఇలా అన్ని చోట్లా ఫస్ట్ ఇయర్ వాళ్లను అవమానించడమే పనిగా పెట్టుకుంటారు. సీనియర్ అయిన శ్రేయతో అర్జున్ చనువుగా ఉండటం, వాళ్ల ఆగ్రహానికి మరింత కారణమవుతుంది. అప్పుడు అమల్ గ్యాంగ్ ఏం చేస్తుంది? వాళ్లను అర్జున్ టీమ్ ఎలా ఎదుర్కొంటుంది? కాలేజ్ క్యాంపస్ వాళ్ల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుంది? అనేది కథ. కాలేజ్ లో తమ పిల్లలు బాగా చదువుకోవాలనీ, కాలేజ్ నుంచి బయటికి రాగానే మంచి జాబ్ సంపాదించి లైఫ్ లో సెటిల్ కావాలని పేరెంట్స్ ఆశపడుతూ ఉంటారు. కాలేజ్ లో ఎలాంటి గొడవలు లేకుండా తమ పిల్లలు బయటపడాలని భావిస్తూ ఉంటారు. అయితే అందుకు పూర్తి విరుద్ధంగా జరుగుతూ ఉంటుంది. ఎక్కడెక్కడి నుంచో చదువుకోవడానికి వచ్చిన స్టూడెంట్స్ మధ్య ఇక్కడ ఎలాంటి వార్ నడుస్తూ ఉంటుందనే అంశం చుట్టూ ఈ కథను అల్లుకున్నారు. కాలేజ్ లలో సీనియర్స్ .. జూనియర్స్ మధ్య సంబంధాలు ఎలా ఉంటాయి. ర్యాగింగ్ అనేది వాళ్లను ఎలా విడదీస్తుంది. సీనియర్స్ ను యాజమాన్యం ఎందుకు నియంత్రించలేకపోతోంది అనే విషయాలను టచ్ చేస్తూ దర్శకుడు ఈ కథను ముందుకు తీసుకుని వెళ్లాడు. ఆవేశాల కారణంగా స్టూడెంట్స్ భవిష్యత్తు ఎలా ప్రశ్నార్థకంగా మారుతుందనేది ఆవిష్కరించడానికి ప్రయత్నించారు. అలాగే స్టూడెంట్స్ కుటుంబాల వైపు నుంచి ఎమోషన్స్ ను కనెక్ట్ చేయడానికి ట్రై చేయడం కనిపిస్తుంది. కాలేజ్ వాతావరణం ఎలా ఉంటుంది .. ఆ క్యాంపస్ లోకి అడుగుపెట్టిన తరువాత స్టూడెంట్స్ ప్రవర్తన ఎలా ఉంటుందనేది సహజంగా ఆవిష్కరించడంలో దర్శకుడు కొంతవరకూ సక్సెస్ అయ్యాడనే చెప్పాలి. లవ్ .. ఫ్రెండ్షిప్ .. కామెడీ .. ఫ్యామిలీ ఎమోషన్స్ లో, కేవలం ఫ్రెండ్షిప్ ను మాత్రమే కాస్త హైలైట్ చేయడం కనిపిస్తుంది. మిగతా అంశాలు అంతగా ప్రభావితం చేయకపోవడం నిరాశను కలిగిస్తుంది కాలేజ్ కథల్లో లవ్ .. రొమాన్స్ అనే అంశాలాను టచ్ చేయకుండా వదలరు. యూత్ లో ఎక్కువగా ఆ అంశాలపై ఫోకస్ చేస్తూనే థియేటర్స్ కి వస్తారు. అయితే ఈ సినిమా విషయంలో ఆ దిశగా ఎలాంటి ప్రయత్నం జరగలేదు. స్టూడెంట్స్ గొడవలు .. కొట్లాటలపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. ఆ గొడవల వెనుక బలమైన ఎమోషన్ లేకపోవడం మరో మైనస్ గా అనిపిస్తుంది. కథ ఒక ఫ్లోలో పరిగెత్తకుండా ఎటెటో వెళుతుంది. అనవసరమైన సన్నివేశాల దిశగా మలుపులు తీసుకుంటుంది. కాలేజ్ క్యాంపస్ లోకి వెహికల్స్ ను అనుమతించమని అంటే, హెలికాప్టర్ లో రావడం వంటి సన్నివేశాలు కాస్త అతిగా అనిపిస్తాయి. అమల్ గ్యాంగ్ అరాచకం చాలదన్నట్టుగా, హకీమ్ గ్యాంగ్ ను రంగంలోకి దింపడం కూడా అలాంటిదే. స్టూడెంట్స్ గా చేసిన వాళ్లంతా బాగానే చేశారు. కాకపోతే ఎమోషన్స్ వైపు నుంచి వాళ్ల పాత్రలను ఎక్కువగా డిజైన్ చేయకపోవడం నిరాశను కలిగిస్తుంది. కథాకథనాలు కొత్తగా .. గొప్పగా అనిపించవు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం . ఎడిటింగ్ ఓ మాదిరిగా ఉన్నాయంతే. యూత్ ను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన కంటెంట్ అయినప్పటికీ, యూత్ ను ఆకట్టుకోలేకపోయిందనే చెప్పాలి.

# ఎల్లమ్మగా మమితాబైజు?



'బలగం' తర్వాత దర్శకుడు 'ఎల్లమ్మ' సినిమా ప్రకటించిన నాటినుంచీ ఈ సినిమాలో నటించే తారల వ్యవహారం ఓ ప్రహసనంగా మారింది. హీరోగా ముందు చాలామంది పేర్లు అనుకున్నారు. చివరకు సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఖరారయ్యారు. ఆయనపై తాజాగా గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. ఇక 'ఎల్లమ్మ'లో హీరోయిన్ ఎవరు? ప్రస్తుతం ఫిల్మ్ వర్గాలను వెంటాడుతున్న ప్రశ్న ఇది. మొదట్లో సాయిపల్లవి అన్నారు. ఆ తర్వాత కీర్తి సురేశ్ పేరు వినిపించింది. ఈ వరుసలోనే చాలామంది హీరోయిన్ల పేర్లు మీడియాలో చక్కర్లు కొట్టాయి. చివరకు మలయాళ మందారం మమితాబైజు ఖరారైందంటూ ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. అయితే.. ఈ పేరు బయటకు వచ్చిన నాటినుంచీ, ప్రేమలు, డ్యూడ్ లాంటి ట్రెండీ క్యారెక్టర్లు చేసే మమితాబైజు ఈ విలేజ్ డ్రామాలో ఇమడగలదా? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ధనుష్ 'కర' సినిమాలో ఆమెది విలేజ్ నేపథ్య పాత్రేననీ, తను స్వతహాగా మంచినటి కాబట్టి, ఎలాంటి పాత్రనైనా అలవోకగా చేయగలదని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా అధికారిక ప్రకటన వచ్చేదాకా ఇవన్నీ ఊహాగానాలే అనాలి.

# సూర్య ఈ సారి ఏం చేస్తాడో చూడాలి మరి!



సూర్య తన కెరియర్ మొదలుపెట్టిన దగ్గర నుంచి ఎక్కడా పెద్దగా గ్యాప్ ఇవ్వకుండా వరుస సినిమాలు చేస్తూ వెళుతున్నాడు. అయితే ఆయనకి సరైన హిట్ పడి చాలా కాలమే అయింది. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన వచ్చిన 'వీరభద్రుడు' (కరుప్పు) కూడా తెలుగులో ఆశించిన స్థాయిలో ఆడలేదు. తమిళనాడులో మాత్రం బాగానే ఆడిందనే వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో ఆయన తాజా చిత్రం నుంచి ఒక అప్ డేట్ వచ్చింది. తనకి తెలుగు దర్శకులతో కలిసి పనిచేయాలని ఉందనీ, నేరుగా తెలుగు సినిమా చేయాలని ఉందని సూర్య ఎప్పటి నుంచో చెబుతూ వస్తున్నాడు. ఇన్నాళ్లకి ఆయన కల నిజమైందని చెప్పుచ్చు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఆయన ఒక సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా పేరే 'విశ్వనాథ్ అండ్ సన్స్'. రీసెంటుగా ఈ సినిమా నుంచి వదిలిన టీజర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాంటి ఈ సినిమాను ఆగస్టు 14వ తేదీన విడుదల చేయనున్నట్టుగా ప్రకటించారు. ఒక 40 ఏళ్ల యువకుడికీ .. 20 ఏళ్ల యువతికి మధ్య నడిచే ప్రేమకథ ఈ సినిమాలో ప్రధానమైనదిగా ప్రేక్షకులను అలరిస్తుందని చెబుతున్నారు. మామితా బైజు కథానాయికగా నటించిన ఈ సినిమాలో, రాధికా శరత్ కుమార్ .. రవీనా టాండన్ కీలకమైన పాత్రలను పోషించారు. సితార బ్యానర్ పై నిర్మితమవుతున్న ఈ సినిమాను, తెలుగు .. తమిళ భాషల్లో విడుదల చేయనున్నారు. చాలాకాలంగా సూర్య వెయిట్ చేస్తున్న భారీ హిట్, ఈ సినిమాతోనైనా పడుతుందేమో చూడాలి

# ప్రతి ఒక్కరూ చూడవలసిన గ్రిప్పింగ్ థ్రిల్లర్ ఇది!



డబ్బుంటే ఆశలు నెరవేర్చుకోవచ్చు .. కలలు నిజం చేసుకోవచ్చు .. కోరుకున్నట్లుగా బ్రతకొచ్చు. అయితే డబ్బుంటే కోరుకున్న సర్టిఫికెట్ ను సంపాదించుకోవచ్చు .. మనసు పడిన జాబ్ ను పొందవచ్చు అనేది చాలా తక్కువ మందికి తెలుసు. అదెలా సాధ్యమనేది చాటిచెబుతున్న సిరీస్ 'ఎగ్జామ్'. సర్గుణం దర్శకత్వం వహించిన ఈ సిరీస్, అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది. దుషారా విజయన్ – అదితి బాలన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్, 7 ఎపిసోడ్స్ గా ఈ నెల 15వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. కాసులుంటే చాలు కష్టపడి చదవాల్సిన పనిలేదు. కష్టపడిన వాళ్లందరినీ దాటుకుంటూ వెళ్లి, వాళ్ల కళ్లముందరే కోరుకున్న సీట్లో కూర్చోవచ్చు. పుస్తకాలలో ఏముందో తెలుసుకోవడం కాదు, ఇక్కడ జరుగుతున్న దందాపై కూడా ఒక లుక్కేయమని చెప్పే సిరీస్ ఇది. అవకాశం లేదనీ .. అదృష్టం కలిసి రాలేదని కొంతమంది స్టూడెంట్స్ పక్కదారి పడుతుంటారు. అవకాశం లేకపోయినా .. అదృష్టం దరిదాపులలో కనిపించకపోయినా మరికొంతమంది అనుకున్నది సాధిస్తారు. అలాంటి రెండు పాత్రల చుట్టూ తిరిగే ఈ కథ ఎమోషనల్ గా ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. బలమైన కథాకథనాలతో .. బలమైన పాత్రలతో నడిచే ఈ సిరీస్, ప్రతి ఒక్కరూ చూసితీరవలసిన సిరీస్ అని చెప్పుచ్చు.

# మంచికి మారుపేరు ఎల్లంకి వసంతం.

## మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్

**-అంగన్వాడి పాఠశాలకు కూలర్ బహూకరించిన కుటుంబ సభ్యులు.**



మంథని(, ప్రశ్న న్యూస్)ఉద్యోగంలో గాని, వీధిలో కానీ, ఊర్లో కానీ మంచికి మారుపేరుగా ఎల్లంకి వసంతం సార్ నిలిచారని మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ అన్నారు.గురువారం మంథని పట్టణంలోని మసీదు వాడ అంగన్వాడి పాఠశాలలో విశ్రాంత ఉద్యోగి స్వర్గీయ ఎల్లంకి వసంతం జయంతిని పురస్కరించుకుని వారి కుమారులు 13వ వార్డు కౌన్సిలర్ ఎల్లంకి వంశీధర్, వాసుదేవ్ ఆధ్వర్యంలో చిన్నపిల్లల సౌకర్యార్థం కూలర్ ను బహుకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ తండ్రి వారసత్వాన్ని పునికి పుచ్చుకున్న వారి కుమారులు వంశీ, వాసు తమ తండ్రి స్మారకంగా చిన్నపిల్లలను వేసవి వేడి నుండి ఉపశమనం కలిగించేందుకు కూలర్ బహుకరించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు ఎల్లంకి రాధిక, ఎల్లంకి శ్రీలత,అనిరుద్, అక్షయ, నాయకులు ఎంఎస్ రెడ్డి, అలీమ్, అంగన్వాడీ టీచర్ జవహారి కుమారి లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# రైతుల పక్షపాతి మంత్రి శ్రీధర్ బాబు.

**రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం.**

**బిజెపి నేతల ఆరోపణ అవాస్తవం.**

**డిసిసి అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్.**



మంథని ( ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని రైతులందరి సంక్షేమమే లక్ష్యంగా తమ కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పెద్దపల్లి డిసిసి అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్ స్పష్టం చేశారు. రైతు భరోసా పర్యటన భాగంగా మంథనిలో పర్యటించిన బిజెపి నాయకులు తమ నేత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కాంగ్రెస్ ప్రభుత్వం పై చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా తమ ఉనికిని చాటు కోవడం కోసం బిజెపి నాయకులు చేసిన ఆరోపాలు అవాస్తవమన్నారు. మంథని నియోజకవర్గం తో పాటు రాష్ట్రంలోని రైతులందరికీ సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. వారి కోసం ఎరువులు, విత్తనాలు, సాగు నీరు అందుబాటులో ఉంచు ఉంచుతూ ఆదుకుంటున్నారన్నారు. పండించిన పంటలకు మద్దతు ధర చెల్లించడంతోపాటు అదనంగా మరో 500 బోనస్ చెల్లిస్తూ రైతులను ఆదుకుంటున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో కురిసే అకాల వర్షాలతో తడిసిన రంగు మారిన ధాన్యాన్ని సైతం తమ ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి ఆదుకుంటామని ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఐటీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబులు ప్రకటించిన విషయం బిజెపి నాయకులకు తెలియకపోవడం విచారకరమన్నారు. రైతులకు అందుబాటులో గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలను కల్పించిందన్నారు. అక్కడక్కడ ఉన్న చిన్న సమస్యలను భూతద్దంలో పెట్టి చూపడంత కదా అన్నారు. బిజెపి నాయకులు ఎన్నడు రైతుల పక్షాన నిలబడి మాట్లాడింది కానీ వారిని ఆదుకున్న తీరు చరిత్రలో లేదన్నారు. ఇప్పటికైనా రాజకీయానికి కోసం బిజెపి నేతలు తమ ప్రభుత్వాన్ని బదనాం చేయడం మానుకోవాలన్నారు.

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసిన సువీన్ యాదవ్

**- ఆత్మీయంగా అభినందించిన విప్ ఆది శ్రీనివాస్**

**- మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆది సూచన**



వేములవాడ / బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన కొమ్మనబోయిన సువీన్ యాదవ్ గురువారం వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ శాలువా కప్పి సువీన్ యాదవ్‌ను అభినందించి, మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.సువీన్ యాదవ్ కుటుంబంతో తమకు దశాబ్దాల అనుబంధం ఉందని, ముఖ్యంగా మల్లేష్ యాదవ్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని ఆది శ్రీనివాస్ గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో తడగొండ సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ చేపూరి వెంకటేష్, మైనారిటీ నాయకులు మహమ్మద్ హుస్సేన్, ఆత్మ కమిటీ సభ్యుడు గుడి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని నాయకులు తెలిపారు.

# వడదెబ్బ మృతుల కుటుంబాలకు రూ.4లక్షల పరిహారం చెల్లించాలి

**- సర్పంచ్ కంటెస్టెడ్ అభ్యర్థి : ఎడపల్లి బాబు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత ప్రజలను భయాందోళనలకు గురి చేస్తోందని బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన సర్పంచ్ కంటెస్టెడ్ అభ్యర్థి ఎడపల్లి బాబు అన్నారు. ఇటీవల వడదెబ్బ కారణంగా పలువురు మృతి చెందుతున్న ఘటనలు బాధాకరమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బతో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. ఎలాంటి ఆలస్యం లేకుండా స్థానిక అధికారుల ధృవీకరణ నివేదిక, డెత్ సర్టిఫికెట్ ఆధారంగా మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ధాన్యం తరలింపులో జాప్యం వద్దు

**-- అదనపు కలెక్టర్ : గడ్డం నగేష్**

**- కొనుగోలు కేంద్రాల్లో వేగవంతంగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు**



వేములవాడ / బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రూరల్, బోయినిపల్లి మండలాల్లోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం తనిఖీ చేశారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులు, గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.వేములవాడ రూరల్ మండలం వట్టెంల, ఫాజుల్‌నగర్, బోయినిపల్లి మండల కేంద్రం, కోరెం, బూరుగుపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఆయన, రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా తూకం వేసి తరలించాలని తెలిపారు. ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు.వర్షాలతో తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందకుండా భరోసా కల్పించాలని, ప్రభుత్వం ధాన్యాన్ని సేకరిస్తుందని అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తూకం వేసిన ధాన్యం లోడింగ్ వేగవంతం చేసేందుకు హమాలీల సంఖ్య పెంచి కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# గజ్వేల్‌లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు వెంటనే పంపిణీ చేయాలి

**- బట్టు దయానంద రెడ్డి**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)గజ్వేల్ నియోజకవర్గంలో సుమారు 400 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు సంబంధించిన చెక్కులు పంపిణీకి సిద్ధంగా ఉన్నప్పటికీ, సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ అందించకపోవడం బాధాకరమని సిపిఐ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు బట్టు దయానంద రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానిక ఎమ్మెల్యే కేసీఆర్ బయటకు రావడం లేదని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సహా కాంగ్రెస్ నాయకత్వానికి కూడా ఈ విషయం తెలిసినా చెక్కుల పంపిణీపై చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నిర్లక్ష్యం కారణంగా ఆడపిల్లల పెళ్లిళ్లు చేసి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సహాయం కోసం ఎదురుచూస్తున్న వందలాది పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. రాజకీయ పంతాల కారణంగా పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం ఏ పార్టీకి మంచిది కాదని హెచ్చరించిన ఆయన, భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున 15 రోజుల్లోగా కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అర్హులైన లబ్ధిదారులతో కలిసి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాల్సి వస్తుందని స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి చెక్కులు పంపిణీ చేసి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులను ఆదుకోవాలని ఆయన కోరారు.

# డా. బి.ఆర్. అంబేద్కర్ డెవలప్‌మెంట్ నూతన కమిటీ ఎన్నికలు

**- ముఖ్య అతిథిగా గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్‌లో డా. బి.ఆర్. అంబేద్కర్ డెవలప్‌మెంట్ కమిటీ నూతన కమిటీ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు కళ్యాణ్‌కార్ నర్సింగరావు, 1వ వార్డు కౌన్సిలర్ కప్ప మమత పోచయ్య పాల్గొన్నారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులైన అధ్యక్షుడు మస్కూరి కిష్టయ్య, కార్యదర్శి బొల్లారం ఎల్లయ్య, ఉపాధ్యక్షులు మన్నె కృష్ణ, మాచపురం బాల్ నర్సయ్య, పొట్ట యాదగిరి, కోశాధికారి పంబాల సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు ఆటకూరి రాములు, కార్యదర్శులు దమ్మని మల్లయ్య, మైస స్వామి, సల్ల నాగయ్య, మల్కగల్ల నాగయ్య, మైసని మల్లయ్య, చింతకింది బాలయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం ప్రజాసంఘాల నాయకులు మైస రాములు, పొన్నాల కుమార్, తుమ్మ శ్రీనివాస్, నీరుడి స్వామి, భైరం శివకుమార్, చిప్పల యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

**- దాచారం కనకయ్య**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ధాన్యం కొనుగోళ్లను వెంటవెంటనే చేపట్టాలని మండల బి అర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దాచారం కనకయ్య పేర్కొన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు ఆరుగాలం కష్టపడి ఎండనక వాననక కష్టపడుతున్న రైతులు పండించిన పంట కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయక కండ్ల ముందు నాశనమవుతుండటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు అని అన్నారు.కొనుగోలు కేంద్రాకు తెచ్చిన ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రోజుల తరబడి ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నెలల తరబడి ధాన్యాన్ని తరలించకపోవడం సిగ్గు చేటని వాపోయారు, చేతికి అందిన పంట కొనే నాథుడు లేక రైతులు అరిగోస ఎల్లభోస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై మండిపడ్డారు,రైతులం అని గర్వంగా చెప్పుకునే రోజులు కాలగర్భంలో కలిసిపోయా యన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి రైతుల పాలిట శాపంగా మారారన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న రోడ్లపై ధాన్యం కుప్పలను కొనుగోలు చర్యలు తీసుకోలేదన్నారు. ఆరుకాలం కష్టం చేసిన రైతుల ధాన్యం అమ్ముకోవడంలో ఇంత జాప్యం ఎందుకని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని గుర్తు చేశారు వడ్లు పండించిన రైతులను ఈ ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు, ఏమాత్రం రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుచేటు ఉంటే వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ముదిరాజ్ కుల పెద్దలను సన్మానించిన ఇమ్మడి శివలక్ష్మి జహంగీర్





గజ్వేల్ (ప్రశ్న న్యూస్) పెద్దమ్మతల్లి, మహంకాలమ్మ తల్లి మరియు కనకదుర్గమ్మ తల్లి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ముదిరాజ్ కుల పెద్దలను ఇమ్మడి శివలక్ష్మి జహంగీర్ శాలువాతో సన్మానించారు, జగదేవపూర్ పట్టణమములో నిర్వహించిన పెద్దమ్మతల్లి, మహంకాలమ్మ తల్లి మరియు కనకదుర్గమ్మ తల్లి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఘనంగా అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది, ప్రత్యేక పూజలు, వేద మంత్రోత్సరణాల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ మహోత్తర కార్యాన్ని దిగ్విజయంగా నిర్వహించిన కుల పెద్దలు రాగుల రాజయ్య, కొంపెల్లి కరుణాకర్, రాగుల రాజు, రాగుల బలరాం, కొంపెల్లి కృష్ణ, రాగుల నర్సింలు, రాయరాం చంద్రయ్య, రాగుల బాలనర్సింలు, అరే కనకయ్య గారిని ఇమ్మడి శివ లక్ష్మి - జహంగీర్ ఘనంగా సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# అకాల వర్షానికి చెబర్తిలో తడిచిన ధాన్యం రోధిస్తున్న రైతాంగం



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చేబర్తి గ్రామంలో అకాల వర్షానికి ధాన్యం తడిచిపోయి వర్షంలో కొట్టుకుపోయిన ధాన్యం చూసి కన్నీరు మున్నీరుగా రోదించిన రైతులు ఈ సందర్భంగా గ్రామ మాజీ ఉప సర్పంచ్ గుర్రాల స్వామి మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే సేకరించాలని సకాలంలో లారీలను పంపిస్తే ధాన్యం తడిసిపోయేది కాదని, ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఇప్పటికైనా వెంటనే ధాన్యం సేకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి పురస్కరించుకొని, ఎన్ టి ఆర్ అభిమానుల ఆధ్వర్యంలో స్థానిక ఎన్ టి ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎఫ్ డి సి మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ చిరస్మరణీయులు అని, యువత రాజకీయాల్లోకి రావడానికి ఎన్ టి ఆర్ స్ఫూర్తి అని వారి అడుగుజాడల్లో యువత పయనించాలని పిలుపునిచ్చారు, అనంతరం మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, వెంకటేశ్వర్లు, టీచర్ మల్లికార్జున్ మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయ నాయకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని, తెలుగు జాతిఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహానాయకుడు ఎన్ టి ఆర్ అని కొనియాడారు పేద ప్రజల సంక్షేమం కోసం ఆయన ప్రవేశపెట్టిన రెండు రూపాయలకు కిలో బియ్యం జనతా వస్త్రాలు పక్కా గృహాల వంటి పథకాలు ఇప్పటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయి అని గుర్తు చేశారు ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, నాయకులు ఆర్ కే శ్రీనివాస్, చింత కుమార్, పరుచూరి రాజు, చింత శ్రీనివాస్, నాయిని తిరుపతి మోచి ప్రభాకర్ విట్టల్ ఎన్ టి ఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# లంచగొండితనంపై కఠిన చర్యలు తీసుకోవాలి

**భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోషియేషన్ ప్రెసిడెంట్ సత్యంగౌడ్**



హైదరాబాదు (ప్రశ్న న్యూస్) రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిరోజు ఏదో ఒక ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యంగా (రెవెన్యూ డిపార్ట్మెంట్లల్లో) ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడుతున్న ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా రోజుకు ఒక్కరైనా లంచాలు తీసుకుంటూ పట్టుబడుతున్నారని సత్యంగౌడ్ ఆందోళన వ్యక్తం చేసారు. ప్రస్తుతం చాలా సందర్భాల్లో లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారులు కొద్ది నెలలు సస్పెన్షన్‌లో ఉండి, తిరిగి విధుల్లో చేరుతున్నారని, అదే ప్లేస్ లో ఓ చిన్న ?ప్రైవేట్? ఉద్యోగి ఆకలికో, అవసరానికో తప్పు చేస్తే కొంపలు మునిగినట్టు తక్షణమే పెద్ద నేరం మోపి ఉద్యోగంలోంచి తీసేసి వాళ్ళ బ్రతుకుల్ని రోడ్ల మీదికీడుస్తున్నారు. కానీ ప్రభుత్వ ఉద్యోగికి అది వర్తించటం లేదని విమర్శించారు. లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారులపై కేవలం సస్పెన్షన్ చర్యలు సరిపోవని, అవినీతికి పూర్తిగా చెక్ పెట్టాలంటే కఠిన నిర్ణయాలు అవసరమని సత్యంగౌడ్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అవినీతి నిరూపితమై పట్టుబడిన ప్రభుత్వ ఉద్యోగులను నేరుగా ఉద్యోగాల నుంచి తొలగించే విధానం తీసుకువస్తే ఇంకొకరు లంచం తీసుకోవడానికి బయపడతారని,తద్వారా లంచగొండితనాన్ని నిర్మూలించవచ్చు అని అభిప్రాయపడ్డారు. ఇలా కఠిన చర్యలు తీసుకుంటేనే ప్రభుత్వ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని సత్యంగౌడ్ పేర్కొన్నారు. అవినీతి రహిత పాలన కోసం ప్రభుత్వం మరింత కఠినమైన చట్టాలు అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.

# తెలంగాణపై కర్ణాటక ఎఫెక్ట్!

## - కాంగ్రెస్ అధిష్ఠానం కార్యాచరణ సిద్ధం చేస్తోందా..?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కర్ణాటకలో టీంను మార్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. మూడేళ్ల సీఎంగా ఉన్న సిద్ధరామయ్యను తప్పించి ఆయన స్థానంలో డీకే శివకుమార్‌ను కూర్చోబెట్టబోతోంది. దీనికి సంబంధించిన ప్రక్రియను సజావుగా జరిగేలా చూస్తోంది. అయితే కర్ణాటకలో నాయకత్వం మార్చినట్టు తెలంగాణలో కూడా చేయించాలనే ఆలోచనలో కొందరు కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారట. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణం చేసి రెండున్నరేళ్లు అయ్యింది. అందుకే నాయకత్వంలో మార్పు దిశగా ఎందుకు అధిష్ఠానం ఆలోచించకూడదని ప్రశ్నిస్తున్నారట. కర్ణాటకలో అనుసరించే విధానం తెలంగాణకు ఎందుకు అప్లై చేయకూడదని కూడా అధిష్ఠానం వద్దకు రాయబారం పంపుతున్నట్టు తెలుస్తోంది.

### - తెలంగాణపై కర్ణాటక ఎఫెక్ట్!

కర్ణాటకలో మారుతున్న రాజకీయాలు ఇప్పుడు తెలంగాణలోనూ షేక్ చేస్తున్నాయి. అక్కడి మాదిరిగానే ఇక్కడ కూడా మార్పులు చేర్పులు జరిగేలా అధిష్ఠానాన్ని ఒప్పించేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డిని సీఎంగా అంగీకరించని ఓ వర్గం నేతలు వీలుచిక్కినప్పుడల్లా అధిష్ఠానం వద్ద తమ అభిప్రాయాన్ని చెబుతూ వస్తున్నారు. అయితే ఇప్పుడు కర్ణాటకలో మార్పులు చేస్తున్నందున పనిలో పనిగా తెలంగాణలో మార్పులు చేర్పులు చేయాలని రిక్వస్ట్ చేస్తున్నారు. ఎలాగూ మంత్రి వర్గ విస్తరణ చేయాల్సిన సమయం వచ్చిందని దానికి బదులు మొత్తం టీంను మారిస్తే వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్ మరింత బలపడుతుందని వారు విశ్లేషణలు వినిపిస్తున్నారు.

### - ఎప్పటి నుంచే రేవంత్ వ్యతిరేకంగా ప్రచారం

కాంగ్రెస్‌లో రేవంత్ రెడ్డికి అధిష్ఠానానికి ఫిర్యాదులు చేయడం, ఆయన్ని మార్చాలని డిమాండ్‌లు చేయడం ఇదేమి కొత్త కాదు. ఆయన పదవీబాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సాగుతోంది. ఆయన పదవీ ప్రమాణం చేసిన నాటి నుంచే ఇలాంటి ప్రచారం సాగుతోంది. ఆయనకు అధిష్ఠానం వద్ద ప్రతిష్ట లేదని, అపాయింట్‌మెంట్స్ కూడా ఇవ్వడం లేదని కొన్ని రోజులు ప్రచారం సాగింది. ఎప్పటికప్పుడు వాటిని తన మార్క్ రాజకీయంతోనే తిప్పికొడుతూ వస్తోంది రేవంత్ వర్గం. ఇప్పుడు కర్ణాటకలో జరిగిన పరిణామాలతో ఇప్పుడు ఇలాంటి ప్రచారం ఊపందుకుంది.

### - నేరుగా ఢీకొట్టిన నేత ఎక్కడ?

తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టి నాటి నుంచి నేరుగా ఆయనపై అసంతృప్తి వ్యక్తం చేసిన నేతలు కనిపించలేదు. అడపాదడపా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి వారు మాత్రమే తన అసహనాన్ని వ్యక్తం చేశారు. తర్వాత ఆయనపై కొందుర పార్టీ నుంచి వెళ్లిపోయిన తర్వాత రేవంత్‌ను విమర్శించారు. అటు మంత్రివర్గంలో కానీ, ఇటు పార్టీలో కానీ నేరుగా రేవంత్‌తో ఢీ కొట్టిన నేత కనిపించ లేదు. కానీ సమయం వచ్చినప్పుడల్లా అధిష్ఠానానికి మాత్రం రిపోర్టులు పంపిస్తున్నారని పార్టీ ఇన్‌సైడ్ టాక్. ఇది ఏ స్థాయికి వెళ్తుందో చూడాలి.

### - ముందు నుంచి డీకే, సిద్ద మధ్య వర్గపోరు

కర్ణాటక కాంగ్రెస్ రాజకీయానికి, తెలంగాణలో రాజకీయానికి చాలా తేడా ఉంది. కర్ణాటకలో అధికారం చేపట్టిన మొదట్లోనే డీకే వర్గం, సిద్ధరామయ్య వర్గం మధ్య స్పష్టమైన ఒప్పందం జరిగిందని అంటున్నారు. రెండున్నరేళ్లు చొప్పున పదవిలో ఉండేందుకు అంగీకరించారని అప్పట్లోనే ప్రచారం జరిగింది. ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసేందుకు ఇద్దరు నేతలు కూడా ఆఖరి నిమిషం వరకు ఫైట్ చేశారు. చివరకు డీకేను శాంతింపజేసిన అధిష్ఠానం సిద్ధరామయ్యకు కుర్చీని అప్పగించింది. అప్పటి నుంచి ఇరు వర్గాల మధ్య తీవ్రమైన ఫైట్ నడిచింది. ఎప్పటికప్పుడు అధిష్ఠానం జోక్యం చేసుకొని వారికి సర్ది చెప్పింది. ఒకానొక స్టేజ్‌లో డీకే బీజేపీలోకి జంప్ అవుతారనే ప్రచారం సాగింది. అయితే ఇప్పుడు తన వర్గం నుంచి తీవ్రమైన ఒత్తిడి రావడంతో సీఎం కుర్చీ కోసం డీకే పట్టుబట్టారు. మూడేళు పూర్తి కావడంతో తన సంగతి ఏంటని డీకే శివకుమార్ ప్రశ్నించడంతో సిద్ధరామయ్యను తప్పుకోమని కాంగ్రెస్ అధినాయకత్వం చెప్పింది.

### - కాంగ్రెస్‌కు తలనొప్పి కలిగించే వర్గపోరు తెలంగాణలో లేదు



తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదు. ఎన్నికల దశ నుంచే ముఖ్యమంత్రి అభ్యర్థిగా అనధికారికంగా రేవంత్ రెడ్డి కొనసాగారు. పార్టీని తన కష్టంతో అధికారంలోకి తీసుకొచ్చారనే పేరు తెచ్చుకున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి పదవి కోసం ఒకరిద్దరు నేతలు ప్రయత్నాలు చేసినా అధిష్ఠానం మాత్రం రేవంత్ రెడ్డి పేరును మాత్రమే పరిశీలించింది. మిగతా ఆశావాహులతో చర్చించి వాస్తవాన్ని వివరించింది. దీంతో వారంతా సైలెంట్ అయిపోయారు. తమకు తగిన గౌరవం లభిస్తే చాలు అన్నట్టు ఉండిపోయారు. ఎప్పటికప్పుడు అధిష్ఠానం వద్దకు వెళ్లి తలనొప్పి కలిగించే నేతలు ఇక్కడ కనిపించడం లేదు.

### - సీనియర్ల గౌరవానికి భంగం కలగకుండా..

ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత తన కంటే సీనియర్లను మంత్రివర్గంలో తీసుకున్న రేవంత్ రెడ్డి వారి గౌరవానికి భంగం కలగుండా జాగ్రత్త పడుతున్నారు. నిర్ణయాలు తీసుకునేటప్పుడ వారి అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇస్తూ వచ్చారు. ఇప్పటికుప్పుడు రేవంత్‌ను దించేసి సీఎం సీట్లు కూర్చోవాలనే ఆలోచన ఉన్న మంత్రులు కనిపించడం లేదు. ఉన్నా అలాంటి వారి చర్యలు ఆ దిశగా కనిపించడం లేదు. మరోవైపు కర్ణాటకలో జరిగినట్టు పవర్ షేరింగ్ ఒప్పందాలు జరగలేదు. దీంతో రేవంత్ రెడ్డి అంటే ఇష్టం లేని కాంగ్రెస్ నేతలు కొందరు మాత్రమే అధిష్ఠానం వద్దకు వెళ్లి తమ మనసులోని మాటను చెబుతున్నారు. అందుకే అధిష్ఠానం మైండ్‌లో తెలంగాణలో టీం మార్చే ఆలోచన ఏదీ లేదని తెలుస్తోంది. అయితే ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణ విషయంలో మాత్రం కసరత్తు సాగుతోందని చెబుతున్నారు. దీనిపై ఇప్పటికే చర్చలు మొదలయ్యాయని, త్వరలోనే కీలక ప్రకటన వస్తుందని కూడా అంటున్నారు.

# మమతా బెనర్జీకి మరో భారీ షాక్

### - అధికార ప్రతినిధి శంతను సేన్ రాజీనామా



కోల్కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నాయకులు వరుసగా రాజీనామా చేస్తున్నారు. తాజాగా సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ శంతను సేన్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పదవికి రాజీనామా చేశారు. నిన్న కకోలీ దస్తీదార్ ఘోష్ పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవులకు రాజీనామా చేశారు. ఈ రాజీనామా మరుసటి రోజే శంతను సేన్ షాకిచ్చారు. 2024 నాటి ఆర్జీకర్ హత్యాచార కేసు, పార్టీపై వస్తున్న నిరంతర అవినీతి ఆరోపణలతో తాను తీవ్ర మనస్తాపం చెంది ఈ నిర్ణయం తీసుకున్నానని శంతను సేన్ పేర్కొన్నారు. పార్టీ అధికార ప్రతినిధిగా తన పాత్రను నిర్వర్తించే స్థితిలో లేనని తెలిపారు. వివిధ సమయాల్లో తాను పార్టీ నిర్ణయాలతో ఏకీభవించలేదని, అనేక వివాదాస్పద అంశాలపై తాను బహిరంగంగానే ప్రశ్నించానని ఆయన పేర్కొన్నారు. అందుకే ప్రజలు తనను వివిధ సందర్భాలలో ఎంతగానో ప్రశంసించారని పేర్కొన్నారు. ఆర్జీకర్ కేసు, నిరుద్యోగం, అవినీతి సహా వివిధ అంశాల కారణంగా ప్రజలు తమను ఓడించారని, అందుకే అధికార ప్రతినిధిగా మాట్లాడటానికి తన మనసు అంగీకరించడం లేదని పేర్కొన్నారు.

# 'ఏఐ'కి డిమాండ్

### - తైవాన్ సెమీకండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ
### - 30 శాతానికి పైగా బోనస్ పెంచుతున్నట్లు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తైవాన్ సెమీకండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ (టీఎస్ఎంసీ) తమ ఉద్యోగులకు బంపరాఫర్ ఇచ్చింది. ఈ సంవత్సరం లాభాల పంపిణీ చెల్లింపులను 30 శాతానికి పైగా పెంచుతున్నట్లు కంపెనీ అధిపతి సీసీ వీయ్ ప్రకటించారు. ఏఐ బూమ్‌తో సెమీ కండక్టర్ రంగంలో భారీగా పెట్టుబడులు వచ్చిపడుతున్నాయి. దీంతో టీఎస్ఎంసీ మార్కెట్ విలువ పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రాఫిట్ షేరింగ్ బోనస్‌ను పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. అయితే సీనియారిటీ, గ్రేడ్, ప్రదర్శన ఆధారంగా చెల్లింపుల మొత్తంలో మార్పులు ఉంటాయి. మే 29వ తేదీన ఈ బోనస్‌లు ఇస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఈ కంపెనీ ఆదాయంలో 30 శాతం వృద్ధి నమోదైంది. ఎన్వీడియా, యాపిల్ వంటి దిగ్గజ కంపెనీలకు టీఎస్ఎంసీ కంపెనీ ఆధునాతన ప్రాసెసర్లను సరఫరా చేస్తోంది. రెవెన్యూ, తయారీపరంగా టీఎస్ఎంసీ ప్రపంచంలోనే నెంబర్ వన్ చిప్ తయారీ సంస్థ. మార్కెట్ విలువ ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక వ్యాల్యూ కలిగిన కంపెనీ ఎన్విడియా. ఇటీవల తైవాన్ స్టాక్ మార్కెట్ దలాల్ స్ట్రీట్‌ను దాటి ఐదో స్థానంలో నిలవడానికి ప్రధాన కారణం ఎన్విడియా సంస్థ. ఏఐకి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తులో తమ ఉత్పత్తులకు డిమాండ్ కొనసాగుతుందనే నమ్మకంతో ఉద్యోగులకు బోనస్‌ను పెంచినట్లు తెలుస్తోంది.

# బీజేపీలో కీలక మార్పులు

### - నాలుగు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులు





న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధిష్ఠానం పలు రాష్ట్రాల్లో పార్టీ నాయకత్వంలో కీలక మార్పులు చేసింది. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, త్రిపుర రాష్ట్రాలకు కొత్త పార్టీ అధ్యక్షులను నియమిస్తూ నేడు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని బీజేపీ జాతీయ కార్యదర్శి అరుణ్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. తాజా మార్పుల ప్రకారం కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా శాఖ సహాయ మంత్రిగా ఉన్న హర్ష్ మల్హోత్రాకు ఢిల్లీ బీజేపీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. వీరేంద్ర సచ్‌దేవా స్థానంలో ఆయన ఈ పదవిని చేపట్టనున్నారు. హర్యానా బీజేపీ నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ అర్చనా గుప్తాను, పంజాబ్ రాష్ట్ర అధ్యక్షుడిగా సర్దార్ కేవల్ సింగ్ ధిల్లాన్‌ను, త్రిపుర సారథిగా డాక్టర్ అభిషేక్ దేబ్రాయ్‌ను నియమించారు.నితిన్ నబిన్ బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీలో జరిగిన తొలి పెద్ద పునర్వ్యవస్థీకరణ ఇదే కావడం గమనార్హం. ఈ నియామకాల్లో పంజాబ్ అధ్యక్షుడి ఎంపికకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ మార్పు కీలకంగా మారింది. ప్రస్తుతం ఆప్ పాలనలో ఉన్న పంజాబ్‌లో కాంగ్రెస్ నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ రాజకీయ అవకాశాన్ని అందిపుచ్చుకుని కీలక శక్తిగా ఎదగాలని బీజేపీ భావిస్తోంది. ఈ కొత్త అధ్యక్షులు త్వరలోనే పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, ఇతర కేంద్ర నాయకులతో సమావేశం కానున్నారు. వీరి నేతృత్వంలో రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో కొత్త కార్యవర్గాల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది.

# రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

### - డీలర్లు, అధికారులు కుమ్మక్కై పక్కదారి పట్టిస్తున్నట్లు సమాచారం
### - ప్రజల వద్ద కిలోకు రూ.18 చొప్పున కొని దళారులకు రూ.30కి విక్రయం - అధికారుల కన్నుగప్పి అక్రమ రవాణా

**పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నది. కొందరు వ్యాపారులు మాఫియాగా ఏర్పడి వివిధ మార్గాల్లో రవాణా చేస్తూ సొమ్ముచేసుకోవడం పరిపాటిగా మారింది. స్పెషల్ ఆపరేషన్ టీం అధికారులు, పోలీస్ అధికారులు దాడులు చేస్తూ నిత్యం ఎక్కడో ఒకచోట పట్టుకుంటున్నా దందాకు మాత్రం బ్రేక్ పడడం లేదు. స్థానిక అధికారుల అండదండలు, రాజకీయ నాయకుల సహాయ సహకారాలతోనే కొంతమంది దళారులు ఈ వ్యాపారం యథేచ్ఛగా సాగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) పేదవాడి ఆకలి తీర్చాల్సిన 'సర్కారు బువ్వ' పక్కదారి పడుతోంది. పైసా ఖర్చు లేకుండా నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యం.. అక్రమార్కుల పాలిట 'కాసుల వర్షం' కురిపిస్తోంది. పోలీసుల దాడులు, అధికారుల తనిఖీలు జరుగుతున్నా.. మేడ్చల్ మండలంలో ఈ అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. యథేచ్ఛగా సాగుతున్న ఈ 'తెల్ల దందా' వెనుక రాజకీయ అండదండలు, అధికారుల మామూళ్ల మతలబు ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### ప్రశ్నార్థకంగా అధికారుల తీరు

ప్రతిరోజూ టన్నుల కొద్దీ బియ్యం తరలిపోతున్నా, విజిలెన్స్ అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు ?

పట్టుబడిన వాహనాలపై నామమాత్రపు కేసులు పెట్టి వదిలేస్తున్నారా? అన్న అనుమానాలు సామాన్య ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి, క్షేత్రస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఉన్న ఈ 'రేషన్ నెట్వర్క్ న్ను ఛేదించకపోతే.. పేదవాడికి దక్కాల్సిన బియ్యం మాఫియా పాలవడం ఖాయం.

# మేడ్చల్ ఆర్టీవో ఆఫీస్‌పై ఏసీబీ పంజా

### - అవినీతి అడ్డాపై ఏకకాలంలో అధికారుల విరుచుకుపాటు
### - పేట్ బషీరాబాద్ కార్యాలయంలో 8 మంది సభ్యుల బృందంతో ఆకస్మిక తనిఖీలు
### - పెన్సిల్ కోడ్‌లు, ఏజెంట్ల దందాపై ఆరా.. వాహనదారుల పత్రాల పరిశీలన
### - ఏసీబీ దాడులపై హర్షం, శాశ్వత పరిష్కారం కోరుతున్న జనం




మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) పేట్ బషీరాబాద్‌లోని మేడ్చల్ జిల్లా రవాణా శాఖ కార్యాలయం వేదికగా సాగుతున్న అక్రమార్కుల లీలలు, అవినీతి సామ్రాజ్యంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం ఉక్కుపాదం మోపారు. కార్యాలయంలో ఏజెంట్ల ప్రమేయం లేకుండా ఏ పనీ కావడం లేదని, దరఖాస్తులపై రాసే 'పెన్సిల్ కోడ్ నంబర్లే' ఇక్కడ కీలకంగా మారాయని ఇటీవల పలు దినపత్రికలలో ప్రచురించిన కథనాలకు అధికారులు స్పందించారు. 8 మంది సభ్యులతో కూడిన ఏసీబీ అధికారుల ప్రత్యేక బృందం ఒక్కసారిగా ఆర్టీవో కార్యాలయంపై దాడి చేసి ఏకకాలంలో తనిఖీలు చేపట్టింది.

### - ఎవరి ద్వారా వచ్చారు ?.. పత్రాల వడపోత :

తనిఖీల్లో భాగంగా ఏసీబీ అధికారులు కార్యాలయానికి వచ్చిన వాహనదారులను, లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజలను నేరుగా గుచ్చిగుచ్చి ప్రశ్నించారు. వారి వద్దనున్న దరఖాస్తు పత్రాలను స్వాధీనం చేసుకుని ఈ పని కోసం మీరు ఎవరిని సంప్రదించారు ? ఏజెంట్ల ద్వారా వచ్చారా ? లేక నేరుగా వచ్చారా ? అంటూ ఆరా తీశారు. కార్యాలయంలోని కంప్యూటర్ సెక్షన్లు పాటు అధికారుల గదులను తమ ఆధీనంలోకి తీసుకుని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.

### - కోడ్ భాష, పెన్సిల్ మార్కులే టార్గెట్ :

దరఖాస్తుదారుడు నేరుగా వస్తే పని కాకుండా కొర్రీలు పెట్టడం, అదే ఏజెంట్ల ద్వారా వెనుక ఒక 'సంఖ్య' లేదా 'పెన్సిల్ కోడ్' రాసి ఉంటే చకచకా ఐఊఇపనులు పూర్తి చేయడంపై ఏసీబీ అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. నిబంధనల ప్రకారం కాకుండా వసూళ్లకు పాల్పడుతున్న కిందిస్థాయి సిబ్బంది, కొంతమంది కానిస్టేబుళ్లు, ప్రైవేటు ఏజెంట్ల పాత్రపై ఆధారాలు సేకరిస్తున్నారు.

### -ఏసీబీ దాడులపై హర్షం, శాశ్వత పరిష్కారం కోరుతున్న జనం :



ఈ ఆకస్మిక దాడులతో ఆర్టీవో ఆఫీసులోని అవినీతి అధికారులు, దళారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఆర్టీవో ఆఫీసు చుట్టూ దళారుల దోపిడీ పరాకాష్టకు చేరింది. సామాన్యుడు నేరుగా వెళ్తే గౌరవం ఉండదు, పనీ అవ్వదు. ప్రస్తుతం తనిఖీలు ఇంకా కొనసాగుతుండగా ఏసీబీ దాడులు కేవలం ఒక్క రోజుతో ముగిసిపోకూడదు. ఈ అవినీతి తిమింగలాలపై కఠిన చర్యలు తీసుకుని, సామాన్య ప్రజలకు నేరుగా, పారదర్శకంగా సేవలు అందేలా శాశ్వత పరిష్కారం చూపాలి" అని స్థానిక పౌరులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588